
నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.in
https://nirbhayavaartha.in

నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY



సంపుటి: 13 సంచిక : 187 రంగారెడ్డి | ఆదివారం 08 నవంబర్ 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | 08-11-2026 November | పేజీలు : 8 | వెల : రూ॥ 1-00

Circulated To: Hyderabad-Rangareddy-Nizamabad-Warangal-Mulugu-Yadadri-Nalgonda-Karimnagar-Khammam-Medak-Sangareddy-Siddipet-Medchal-Jagityal-Vemulawada



ఎండిన పంటలు

కన్నీటి సంద్రంలో రైతులు

- 25 లక్షల ఎకరాల్లో పంట నష్టం
- రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం: హరీశ్‌రావు
- పంట నష్టంపై సర్వే చేసి పరిహారం చెల్లించాలని డిమాండ్
- ధాన్యం కొనుగోళ్లకు మిల్లుల కేటాయింపులు పూర్తి చేయాలని లేఖ

తెలంగాణలో కరువు పరిస్థితులు రైతులను తీవ్ర సంక్షోభంలోకి నెట్టాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ఒకవైపు వర్షాభావ పరిస్థితులతో పంటలు చేతికందక రైతులు ఇబ్బందులు పడుతుంటే.. మరోవైపు ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వారిని మరింత ఆందోళనకు గురిచేస్తోందని విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శనివారం ఆయన బహిరంగ లేఖ రాశారు. పంట నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవడంతోపాటు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్, నిర్భయవార్త ప్రతినిధి :

25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి

రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న కరువు పరిస్థితుల ప్రభావంతో లక్షలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని హరీశ్‌రావు తన లేఖలో పేర్కొన్నారు. సుమారు 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో శ్రమించి పెట్టుబడులు పెట్టిన రైతులకు చివరకు పంట చేతికందకపోవడంతో ఆర్థికంగా కుంగిపోయారని తెలిపారు. ఇప్పటికే నష్టాల ఊబిలో ఉన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎండిపోయిన పంట పొలాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, పంటల వారీగా నష్టం వివరాలను సేకరించి సమగ్ర నివేదిక రూపొందించాలని కోరారు. నష్టపోయిన ప్రతి రైతును గుర్తించి తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం

మరోవైపు రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సక్రమంగా సాగడం లేదని హరీశ్‌రావు విమర్శించారు. రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించుకునేందుకు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించకపోవడం, మిల్లుల కేటాయింపుల్లో జాప్యం కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, మిల్లుల అలాట్‌మెంట్ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

బిల్లుల పెండింగ్‌తో కొనుగోళ్లకు ఆటంకం

మార్కెటింగ్ శాఖలో బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో అధికారులు, సిబ్బంది ధాన్యం కొనుగోళ్లకు ముందుకు రావడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లలో జాప్యం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం రైతులకు శాపంగా మారకూడదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది, గన్నీ సంచులు, రవాణా, తూకం వంటి సౌకర్యాలను సకాలంలో కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.పంట నష్టపోయిన రైతులను పక్క రాష్ట్రాలు ఆదుకుంటుంటే.. తెలంగాణ ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని హరీశ్‌రావు విమర్శించారు. పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో అంచనా వేసి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.రైతుల సమస్యలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని, ఎండిపోయిన పంటలపై సమగ్ర సర్వే నిర్వహించి నష్టపోయిన వారందరికీ పరిహారం ఇవ్వాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించి, మిల్లుల కేటాయింపులు వెంటనే పూర్తి చేయాలన్నారు. పెండింగ్ బిల్లులను పరిష్కరించి, ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసి రైతులకు డబ్బులు చెల్లించాలని సూచించారు. రైతులు అప్పులపాలై ఆత్మస్థైర్యం కోల్పోకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ముఖ్యమంత్రికి రాసిన బహిరంగ లేఖలో హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు

ఇందిరమ్మ ఇళ్లే నిర్మాణంతో పేదల కుటుంబాల్లో దీపావళి వెలుగులు: మంత్రి పొన్నం ప్రభాకర్



సిద్దిపేట జిల్లా, నవంబరు 7 నిర్భయవార్త ప్రతినిధి : దశాబ్ద కాలంగా ఎదురు చూస్తున్న పేదల సొంతింటి కలను తమ ప్రభుత్వంలో సాకారం చేస్తున్నామని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల కుటుంబాల్లో దీపావళి వెలుగులు నింపామని పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని 12వ వార్డులో 'మన ఇందిరమ్మ ఇళ్ల'ల్లో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల యజమాని పొన్నం కోమల, సమ్మయ్య ముదిరాజ్ కుటుంబానికి బట్టలు పెట్టి, స్వీట్లు తినిపించి, మంత్రి పొన్నం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దీపావళి సందర్భంగా లబ్ధిదారుడి ఇంట్లో క్రాకర్స్, బాణాసంచా కాల్చి పండుగను చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో మొదటి దశలో పూర్తయిన 2,500కు పైగా ఇందిరమ్మ ఇళ్లల్లో దీపావళి సంబరాలు జరుపుతున్నామని మంత్రి పొన్నం తెలిపారు. ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. రెండో దశలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను వారం పది రోజుల్లో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందించే ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పుకొచ్చారు. పదేళ్ల నిరీక్షణ తర్వాత సొంతింటి కల నెరవేరడం లబ్ధిదారుల కుటుంబాలకు ఎంతో సంతోషకరమైన విషయమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

పిన్ని ఇంటికే కన్నం

స్నేహం ముసుగులో భారీ చోరీ

స్నేహం పేరుతో నమ్మించి భారీ చోరీకి పాల్పడిన ఘటన హైదరాబాద్‌లోని నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. తన స్నేహితురాలి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న ఓ కాలేజీ వార్డెన్, ఆమె పిన్ని ఇంట్లో ఏకంగా 556 గ్రాముల బంగారం, 2.9 కిలోల వెండి ఆభరణాలను అపహరించాడు. ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు అతడి నుంచి 429 గ్రాముల బంగారం, రూ.25 లక్షల నగదుతో పాటు వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఓ కళాశాలలో వార్డెన్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్‌కు అదే కళాశాలలో చదువుతున్న విద్యార్థినితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో ఆమె పిన్ని కుమారి మానే పద్మావతి ఇంట్లో భారీగా బంగారు ఆభరణాలు ఉన్నట్లు గుర్తించాడు. తనకు అప్పులు ఉన్నాయని, కొంతకాలం బంగారం తాకట్టు పెట్టి అప్పులు తీర్చుకుని తిరిగి ఇచ్చేస్తానని విద్యార్థినిని నమ్మించాడు. ఆమెను ఒప్పించి ఇంటి తాళాలు తీసుకున్నాడు.

నిర్భయవార్త ప్రతినిధి :



తాళాలు తీసుకుని చోరీ

గత అక్టోబర్ 20న పద్మావతి ఇంటికి తాళం వేసి మార్కెట్‌కు వెళ్లిన సమయంలో చంద్రశేఖర్ తన పథకాన్ని అమలు చేశాడు. ఇంట్లోకి ప్రవేశించి 556 గ్రాముల బంగారం, 2.9 కిలోల వెండి వస్తువులను అపహరించాడు. అనంతరం బాధితురాలి ఫిర్యాదుతో నేరేడ్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో బాధితురాలి సోదరి కుమార్తె ద్వారా చంద్రశేఖర్‌పై అనుమానం వ్యక్తమైంది. సాంకేతిక ఆధారాలను విశ్లేషించిన పోలీసులు నిందితుడిని తిరుమలగిరిలో గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో చంద్రశేఖర్ తన నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. చోరీ చేసిన బంగారంలో కొంత భాగాన్ని గుంటూరు, చార్మినార్ ప్రాంతాల్లో విక్రయించి రూ.25 లక్షలు పొందినట్లు వెల్లడించారు. నిందితుడి నుంచి 429 గ్రాముల బంగారం, రూ.25 లక్షల నగదు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు మల్కాజ్‌గిరి డీసీపీ శ్రీధర్ వెల్లడించారు. కేసును చాకచక్యంగా ఛేదించిన పోలీసు సిబ్బందిని అయన అభినందించారు.

స్నేహితురాలిని నమ్మించి ఇంటి తాళాలు తీసుకున్న వార్డెన్

556 గ్రాముల బంగారం.. 2.9 కిలోల వెండి అపహరణ

నిందితుడు కాలేజీ వార్డెన్ చంద్రశేఖర్‌గా గుర్తింపు

429 గ్రాముల బంగారం, ₹25 లక్షల నగదు స్వాధీనం

తిరుమలగిరిలో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు



నిర్భయవార్త

సంపాదకీయం

ఆదివారం 08 నవంబర్ 2026

ట్రంప్, మోదీ మధ్య పోలికలన్నీ పైపైనే!

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో అక్కడి రిపబ్లికన్ పార్టీకి అనూహ్య ఓటమి ఎదురుకావటం చూసి ప్రపంచవ్యాప్తంగా లిబరల్స్ చాలా సంతోషంగా ఉన్నారు. వారే కాదు, ట్రంప్ పాలన ప్రపంచవ్యాప్తంగా ఎంత గందరగోళాన్ని సృష్టించిందో చూసి ఆందోళన చెందినవారంతా ఈ ఫలితాలను చూసి సంతోషించారు. ప్రపంచమంతా ఎందుకు ఇంత ఊరట చెందిందో అర్థం చేసుకోవడం సులువే.మనలో చాలామంది అమెరికాను, దాని రాజకీయ వ్యవస్థను చాలా కట్టుదిట్టమైనదని భావిస్తూ పెరిగారు. మా యూనివర్సిటీలో కూడా అమెరికా రాజకీయ వ్యవస్థ గురించి అలాగే బోధించారు. అమెరికాలో వ్యవస్థల మధ్య పరస్పర నియంత్రణ చాలా బలంగా ఉంటుందనీ, అందుకే ఎవరో ఒక వ్యక్తి దూకుడు వల్ల మొత్తం వ్యవస్థ తడబడే అవకాశం లేదనీ మాకు చెప్పారు. ఆ దేశంలో ప్రతి నిర్ణయం వెనుకా అందరి ఏకాభిప్రాయమూ ఉండటమన్నది తప్పనిసరి అన్నారు. కానీ ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక ఆ భ్రమలన్నీ పటాపంచలయ్యాయి. తన దేశం ఏ ఆదర్శాల మీద నిలబడిందో వాటి పట్ల ఏ ఖాతరూ లేని ఒక బలమైన నాయకుడు తల్చుకుంటే వ్యవస్థల మధ్య పరస్పర నియంత్రణను సులభంగా రద్దు చేయగలడు, సుప్రీంకోర్టు నుంచి మద్దతు కూడగట్టుకోగలడు, చట్టసభలను చెప్పుచేతల్లో పెట్టుకుని నడిపించగలడు, మీడియాను బెదరగొట్టగలడు, మైనారిటీలను పీడించగలడు, కుబేరులైన దోస్తులకు మరింత దోచిపెట్టగలడు, కీలక నిర్ణయాల వెనుక ఏకాభిప్రాయం ఉండాలన్న సూత్రాన్నే అపహాస్యం చేయగలడు.భారత్ విషయానికొస్తే-- ఇక్కడి ప్రజాస్వామ్య వ్యవస్థపై మనకు ఆ మాత్రం భ్రమలు కూడా లేవు. ఇక్కడ ఒక బలమైన నాయకుడు తల్చుకుంటే చాలా సులభంగా రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేయగలడని మనకు తెలుసు. ఇందిరాగాంధీ ఆ పని చేశారు. ఇప్పుడు ప్రధానమంత్రి మోదీ కూడా, ఏకాభిప్రాయ సూత్రాన్ని లెక్కచేయకుండా, ప్రజాస్వామ్య గత ఆనవాయితీలను పట్టించుకోకుండా, ఇష్టం వచ్చినట్టు ఏదైనా చేయగలుగుతున్నారు.ట్రంప్‌కు ఎదురుదెబ్బ తగిలినందుకు భారత్‌లో కొందరు ఆలోచనాపరులు సంతోషించారంటే దానికి కారణం-- అమెరికా పరిణామాలను మన దేశ పరిస్థితులకు అన్వయించుకున్నప్పుడు వారిలో చిగురించిన ఆశే! ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతుడైన ట్రంప్ లాంటి వ్యక్తికే ఎదురుదెబ్బ తగిలిందంటే, మరి మన దేశ నాయకత్వం పరిస్థితి ఏమిటి? ఇక్కడ కూడా అదే జరిగే అవకాశం ఉందా? అన్నది వారి ఆలోచన. క్లుప్తంగా చెప్పాలంటే, అవును, జరిగే అవకాశం ఉంది. అయితే అమెరికా, భారతదేశాల మధ్య పోలికల గురించి మనం అతిగా ఊహించుకోకూడదు. ఎందుకంటే ఈ రెండు దేశాల మధ్య ముఖ్యమైన తేడాలు కూడా ఉన్నాయి. ముందు పోలికల గురించి మాట్లాడుకుందాం. అమెరికాలో ఎన్నికల ఫలితాల తర్వాత అక్కడ గెలిచిన డెమొక్రటిక్ అభ్యర్థులు చేసిన ప్రసంగాలను వింటే, అవి మనకు ఎంతోకొంత ఈ దేశంలోని పరిస్థితిని గుర్తుచేయక మానవు. ఉదాహరణకు, మిషిగన్ నుంచి కొత్తగా ఎన్నికైన 42 ఏళ్ల సెనేటర్ అబ్దుల్ ఎల్ సయెద్-- తన ప్రత్యర్థులు ఇస్లాంను ఒక దుష్ట మతంగా చిత్రీకరించారనీ, ముస్లింలపై వ్యతిరేకత తీసుకురావటం ద్వారా తనను ఓడించాలని చూసారనీ చెప్పారు. సెనేటర్‌గా ఎన్నికైన 37 ఏళ్ల జేమ్స్ తలారికో మన రాహుల్‌గాంధీని గుర్తు తెస్తూ, విభజన రాజకీయాల స్థానంలో ప్రేమతో కూడిన రాజకీయాలను తేవాలని పిలుపునిచ్చారు. అలాగే, 39 ఏళ్ల సెనేటర్ జాన్ ఒసాఫ్ తన ప్రసంగంలో-- ఒకపక్క ప్రజలంతా పేదరికంలోకి కూరుకుపోతుంటే మరింత డబ్బు కూడబెడుతున్న కుబేరులను తీవ్రంగా విమర్శించారు. ఇవన్నీ మనకు ఇక్కడి పరిస్థితినే తలపిస్తాయి. అయితే గమనించాల్సిన అంశం ఒకటుంది. రిపబ్లికన్లు ఓడిపోవటానికి కారణం సమాజంలో చీలికలు తెచ్చిన ట్రంప్ విధానాలో, అతను మైనారిటీల పట్ల వెళ్లగక్కిన విద్వేషమో కాదు. అమెరికన్లకు నిజంగానే అలాంటి ధోరణి నచ్చకపోతే, వారు అసలు ట్రంప్‌ను ఎన్నుకునేవారే కాదు.రిపబ్లికన్ల ఓటమికి ప్రధాన కారణం అక్కడి ద్రవ్యోల్బణం అని ఎన్నికల సర్వేలు చెప్తున్నాయి. అలాగే అమెరికా ఇరాన్‌తో చేస్తున్న ఎప్పటికీ గెలవలేని యుద్ధం కూడా మరో కారణం. అలాగే ప్రపంచంలోని పలు దేశాలపై ట్రంప్ విధించిన అర్థంపర్థంలేని సుంకాలు కూడా ద్రవ్యోల్బణ పరిణామాలకు దారితీశాయి. అక్కడ ఫలితాలను ప్రభావితం చేసిన కీలకమైన అంశాలు ఇవే. ఈ విషయాల్లో మన దేశం పరిస్థితి పూర్తిగా వేరు. మన దేశంలో ద్రవ్యోల్బణం ఇంకా అంతటి పెద్ద సమస్యగా మారలేదు. కుబేరుల ఆధిపత్యంపై ఇక్కడ కొంత అసంతృప్తి ఉన్న మాట నిజమే కానీ, అది ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే స్థాయికి ఇంకా వెళ్లలేదు. అలాగే మనం అమెరికా వలే గెలవలేని యుద్ధాలేమీ చేయడం లేదు.ట్రంప్--మోదీల స్వభావాల్లో కూడా స్పష్టమైన తేడాలున్నాయి. ట్రంప్ విపరీతమైన అధికార మదంతో, అతిశయించిన స్వీయమోహంతో, చపలచిత్తంగా వ్యవహరించే ఒక విచిత్రమైన వ్యక్తి. మోదీ మాత్రం తెలివిగా ఆలోచిస్తారు, ఆచితూచి అడుగులు వేస్తారు, దీర్ఘకాలిక వ్యూహాలు పన్నుతారు. ఆయన పాలనకు వ్యతిరేకంగా నిరసనల నేపథ్యంలో ఆయన రాజకీయ కౌశలం కొంత మసకబారినట్టు కనిపిస్తే కనిపించవచ్చు. అయినప్పటికీ, మోదీ అత్యంత ప్రతికూలతల మధ్య కూడా ట్రంప్ కంటే వెయ్యిరెట్లు తెలివిగా వ్యవహరించగలరు. ఉదాహరణకు, మధ్యంతర ఎన్నికల్లో తన పార్టీకి ఎలాంటి ఘోర పరాజయం ఎదురుకాబోతోందో గ్రహించడానికి ట్రంప్‌కి చాలా సమయం పట్టింది. కానీ మన దేశంలో మోదీ మాత్రం వచ్చే ఏడాది జరగబోయే ఉత్తరప్రదేశ్ ఎన్నికల గురించి నెలల ముందుగానే ఆలోచించడం మొదలుపెట్టారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ఆ పదవిలో కొనసాగించడానికి ఆయన ఇంత గట్టిగా ప్రయత్నించడానికి ఒక కారణం ఇదే.ట్రంప్, మోదీల మధ్య తేడాను చూపించేవి మరో రెండు విషయాలు ఉన్నాయి. మొదటిది, ట్రంప్ ఎంత బెదిరింపుల వాతావరణాన్ని సృష్టించినప్పటికీ, అమెరికాలో ఇప్పటికీ నిజాలను వెల్లడించే ప్రధాన స్రవంతి వార్తా సంస్థలు సరిపడినన్ని ఉన్నాయి. కానీ మన దేశంలో దాదాపు ప్రధాన స్రవంతి మీడియా అంతా ప్రభుత్వానికి భయపడుతున్నది. ఇది ముఖ్యమైన తేడా. ఎందుకంటే, సరైన సమాచారం లేని ఓటర్లు ఎన్నికల సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోలేరు.

మనుషులకు వ్యాక్సిన్లు ఉన్నప్పుడు..

పంటలకు ఎందుకు ఉండకూడదు?

పంటలకూ రోగనిరోధక టీకాలు.. వ్యవసాయ రంగంలో సరికొత్త శాస్త్రీయ విప్లవానికి శ్రీకారం చుట్టాలి!

మానవాళిని అనేక ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడటంలో వైద్యశాస్త్రం సాధించిన అద్భుత విజయాల్లో వ్యాక్సిన్ల అభివృద్ధి ఒకటి. వ్యాధి సోకిన తరువాత చికిత్స చేయడమే కాకుండా, వ్యాధి రాకముందే శరీరంలోని రోగనిరోధక వ్యవస్థను అప్రమత్తం చేసి రక్షణ కల్పించే శక్తివంతమైన ఆయుధంగా వ్యాక్సిన్లు నిలుస్తున్నాయి. మరి అలాంటి రక్షణ వ్యవస్థ వ్యవసాయ పంటలకు ఎందుకు ఉండకూడదు? మనిషికి వ్యాక్సిన్ ఇచ్చినట్లుగానే పంటలకు కూడా ముందస్తు రోగనిరోధక శక్తిని కల్పించే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎందుకు అభివృద్ధి చేయకూడదు? అనే ప్రశ్న ఇప్పుడు వ్యవసాయ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, ప్రభుత్వాల ముందుకు రావాల్సిన అవసరం ఉంది.భారతదేశ ఆర్థిక వ్యవస్థకు, కోట్లాది మంది రైతుల జీవనోపాధికి, దేశ ఆహార భద్రతకు వ్యవసాయం వెన్నెముకగా నిలుస్తోంది. అయితే రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో పంటలకు సోకే తెగుళ్లు, వైరస్, బ్యాక్టీరియా, శిలీంధ్ర సంబంధిత వ్యాధులు కీలకమైనవి. పంట ఏపుగా పెరుగుతున్న సమయంలో వ్యాధులు సోకితే రైతు పెట్టిన పెట్టుబడి ఒక్కసారిగా ప్రమాదంలో పడుతుంది. వాటి నివారణకు పురుగుమందులు, శిలీంధ్రనాశక మందులు, ఇతర రసాయనాలపై భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. అయినప్పటికీ కొన్ని వ్యాధులను పూర్తిగా నియంత్రించడం సాధ్యం కావడం లేదు. ఫలితంగా సాగు వ్యయం పెరిగి, దిగుబడులు తగ్గి రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను చవిచూస్తున్నారు.ఈ పరిస్థితికి శాశ్వత పరిష్కార మార్గాలను అన్వేషించాల్సిన సమయం ఆసన్నమైంది. వ్యాధులు వచ్చిన తరువాత మందులు పిచికారీ చేయడం ఒక్కటే పరిష్కారంగా భావించకుండా, వ్యాధులు సోకకముందే మొక్కల్లో రోగనిరోధక వ్యవస్థను ఉత్తేజపరిచి రక్షణ కల్పించే విధానాలపై పరిశోధనలు విస్తృతం చేయాలి. మొక్కలకు కూడా సహజమైన రక్షణ వ్యవస్థ ఉంటుంది. దానిని ముందుగానే ప్రేరేపించే పదార్థాలు, జీవసాంకేతిక పద్ధతులు, బలహీనపరిచిన వైరస్ జాతుల ఆధారంగా కొన్ని పంటలకు రక్షణ కల్పించే విధానాలు ఇప్పటికే ప్రపంచంలోని పలు దేశాల్లో పరిశోధన, ప్రయోగ, వినియోగ దశల్లో ఉన్నాయి.జపాన్‌లో దోసకాయ, టమాటా, మిరప వంటి పంటల్లో కొన్ని వైరస్ వ్యాధుల నియంత్రణకు బలహీనపరిచిన వైరస్ జాతులను ఉపయోగించే పద్ధతులు అభివృద్ధి చేశారు. చైనాలో [illegible]అస్త్ర వంటి ఉత్పత్తులు మొక్కల సహజ రోగనిరోధక ప్రతిస్పందనను ప్రేరేపించే విధంగా వినియోగంలో ఉన్నాయి. అమెరికాలో [illegible]అస్త్రుతీస, యూరప్‌లో దీఅశీఅ వంటి ఉత్పత్తులు కూడా మొక్కల్లో రోగనిరోధక వ్యవస్థను ఉత్తేజపరిచే



విధానాలకు ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. ఇవి మనుషులకు ఇచ్చే సంప్రదాయ వ్యాక్సిన్లతో పూర్తిగా సమానమైనవి కాకపోయినా, మొక్కలకు ముందస్తు రక్షణ కల్పించే దిశగా శాస్త్రవిజ్ఞానం సాధిస్తున్న పురోగతిని సూచిస్తున్నాయి.భారతదేశంలోనూ ఈ దిశగా పరిశోధనలు ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. 2020లో హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయ పరిశోధకులు వరి పంటను బ్యాక్టీరియల్ లీఫ్ బ్లైట్ వ్యాధి నుంచి రక్షించేందుకు మొక్కల రోగనిరోధక వ్యవస్థను ప్రేరేపించే వ్యాక్సిన్ తరహా సాంకేతికతపై పరిశోధనలు చేపట్టినట్లు కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ ప్రకటించడం ఈ రంగంలో ఆశాజనక పరిణామం. ఇటువంటి పరిశోధనలను మరింత విస్తరించి, ప్రయోగశాలలకే పరిమితం కాకుండా రైతుల పొలాలకు చేరేలా కార్యాచరణ రూపొందించాలి. ముఖ్యంగా వరి, పత్తి, మిరప, మామిడి, అరటి, చెరకు, కూరగాయలు వంటి ప్రధాన పంటలకు వచ్చే వైరస్, బ్యాక్టీరియా, శిలీంధ్ర వ్యాధులను ముందుగానే అడ్డుకునే సురక్షితమైన, తక్కువ ఖర్చుతో కూడిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలి. ప్రతి పంటకు, ప్రతి వ్యాధికి అనుగుణంగా ప్రత్యేకమైన రోగనిరోధక పరిష్కారాలను రూపొందించాలి. విత్తన శుద్ధి, విత్తన దశ, నారుమడి దశ నుంచే మొక్కలకు రక్షణ కల్పించే పద్ధతులను పరిశోధించాలి. అయితే ప్రతి వ్యాధికి ఒకే రకమైన వ్యాక్సిన్ పనిచేస్తుందని భావించకుండా, వ్యాధికారక జీవి స్వభావం, పంట రకం, వాతావరణ పరిస్థితులను బట్టి శాస్త్రీయ పరిష్కారాలను అభివృద్ధి చేయడం అత్యంత ముఖ్యం.ఈ లక్ష్య సాధన కోసం భారత ప్రభుత్వం ప్రత్యేకంగా 'జాతీయ పంటల రోగనిరోధక పరిశోధనా మిషన్'ను ప్రారంభించాలి. భారత వ్యవసాయ పరిశోధనా మండలి , దేశంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, బయోటెక్నాలజీ పరిశోధనా సంస్థలు, ప్రైవేటు పరిశోధనా సంస్థలు సమన్వయంతో పనిచేసేలా కార్యాచరణ రూపొందించాలి. ప్రతి రాష్ట్రంలో ప్లాంట్ ఇమ్యూనిటీ పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేసి, స్థానిక పంటలు, వాతావరణ పరిస్థితులు, ప్రాంతీయంగా ఎక్కువగా వ్యాపించే తెగుళ్లపై ప్రత్యేక అధ్యయనాలు చేపట్టాలి. ఈ పరిశోధనలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు కేటాయించాలి. ఇప్పటికే ఇతర దేశాల్లో అభివృద్ధి చేసిన సాంకేతికతలను భారతీయ పంటలు, నేలలు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పరీక్షించాలి. ప్రయోగశాల స్థాయి పరిశోధనలతో పాటు వివిధ వ్యవసాయ ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరీక్షలు నిర్వహించాలి. పర్యావరణానికి, మనుషులకు, పశు పక్ష్యాదులకు హాని కలగకుండా భద్రతా ప్రమాణాలను నిర్ధారించిన తరువాతే వాటిని రైతులకు అందుబాటులోకి తీసుకురావాలి. పంటలకు ముందస్తు రోగనిరోధక రక్షణ కల్పించే సాంకేతికతలు అందుబాటులోకి వస్తే రైతులకు అనేక ప్రయోజనాలు కలుగుతాయి. వ్యాధుల నియంత్రణ కోసం రసాయనాలపై ఆధారపడటం కొంతవరకు తగ్గుతుంది. సాగు ఖర్చులు తగ్గే అవకాశం ఉంటుంది. పంట దిగుబడులు, నాణ్యత మెరుగుపడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుంది. ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పులతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఇది అదనపు రక్షణ కవచంగా నిలిచే అవకాశం ఉంది.

ప్రభుత్వాలకు ఒక విజ్ఞప్తి..

మనుషుల ఆరోగ్య పరిరక్షణకు వ్యాక్సిన్ల అభివృద్ధికి ఎంతటి ప్రాధాన్యం ఇస్తున్నామో, దేశ వ్యవసాయాన్ని కాపాడేందుకు కూడా పంటల రోగనిరోధక పరిశోధనలకు అంతే ప్రాధాన్యం ఇవ్వాలి. పంటలకు వ్యాధులు సోకిన తరువాత స్పందించే విధానానికి బదులుగా, వ్యాధులు రాకముందే రక్షణ కల్పించే శాస్త్రీయ వ్యవస్థను నిర్మించాలి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయి పరిశోధనా మిషన్‌ను ప్రారంభించి, వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించాలి. రైతులకు అందుబాటు ధరల్లో పంటల రోగనిరోధక ఉత్పత్తులు అందేలా చర్యలు తీసుకోవాలి. వ్యవసాయం కేవలం ఆహార ఉత్పత్తి రంగం మాత్రమే కాదు.. అది దేశ ఆర్థిక భద్రతకు, గ్రామీణ జీవనానికి పునాది. రైతు పంటను కాపాడటం అంటే రైతు కుటుంబాన్ని కాపాడటమే కాదు, దేశ ఆహార భద్రతను పరిరక్షించడమే. మనిషికి వ్యాధులు రాకుండా ముందస్తు రక్షణ కల్పించే వైద్యశాస్త్ర స్ఫూర్తితో, పంటలకు కూడా ముందస్తు రోగనిరోధక రక్షణ కల్పించే సాంకేతికతను అభివృద్ధి చేయాలి. రైతు చేతిలో నాగలి ఉన్నట్లే.. పంటను కాపాడే శాస్త్రీయ రక్షణ కవచం కూడా ఉండాలి. భారత వ్యవసాయ రంగంలో పంటల వ్యాక్సిన్ల పరిశోధన ఒక జాతీయ ప్రాధాన్య అంశంగా మారాలి. ఈ దిశగా ఇప్పుడే అడుగులు వేస్తేనే భవిష్యత్తు తరాలకు సురక్షితమైన, సుస్థిరమైన వ్యవసాయాన్ని అందించగలం.

రాజకీయం కాదు, అంకెలతో మాట్లాడండి!

తెలంగాణ ప్రజలకు ఒక సంతోషకరమైన వార్త. యాదాద్రి ప్రాజెక్టులో 800 మెగావాట్ల ఐదో యూనిట్ పూర్తయి గ్రిడ్‌కు సింక్రనైజ్ అయింది. దీంతో మొత్తం 4,000 మెగావాట్ల ప్రాజెక్టు మరో కీలక మైలురాయిని చేరుకుంది. అలాగే, యాదాద్రికి కోల్ ఇండియా నుంచి సంవత్సరానికి సుమారు 50 లక్షల టన్నుల బొగ్గు సరఫరాకు అంగీకారం లభించడం కూడా మంచి పరిణామం.నల్లగొండ జిల్లా దామరచర్లలోని ఈ యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు బొగ్గు గనులకు దూరంగా ఉండటంతో అవసరమైన బొగ్గును తరలించడానికి భారీ వ్యయం అవుతుందని, దీనివల్ల రాష్ట్రంపై అదనపు ఆర్థిక భారం పడుతుందని ప్రస్తుత ప్రభుత్వం వాదిస్తోంది. 4,000 మెగావాట్ల భారీ విద్యుత్ ప్రాజెక్టును కేవలం బొగ్గు రవాణా ఖర్చు ఆధారంగా అంచనా వేయడం సమగ్ర విధానం కాదు. భూమి, నీరు, రైల్వే కనెక్టివిటీ, బొగ్గు రవాణా, విద్యుత్ ఇవాక్యుయేషన్, ప్రసార అవసరాలు, ప్రధాన విద్యుత్ వినియోగ కేంద్రాలకు సమీపం, పర్యావరణ అంశాలు, మొత్తం జీవితకాల విద్యుత్ ఉత్పత్తి వ్యయం-- అన్నింటినీ కలిపి చూడాలి.ఐదు 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ యూనిట్లతో మొత్తం 4,000 మెగావాట్ల సామర్థ్యంతో ఈ ప్రాజెక్టును రూపొందించారు. దామరచర్లలో ప్రాజెక్టును ఏర్పాటు చేయాలన్న నిర్ణయం గత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తీసుకున్నారు. ఆ నిర్ణయంపై రాజకీయ భేదాభిప్రాయాలు ఉండవచ్చు. కానీ దాని సమర్థతను వాస్తవాల ఆధారంగా సమీక్షించాలి. దామరచర్లకు కీలకమైన మౌలిక వసతుల అనుకూలతలు ఉన్నాయి.కృష్ణా నది నుంచి సుమారు 208 క్యూసెక్కుల నీరు, అంటే సంవత్సరానికి దాదాపు 6.6 టీఎంసీల కేటాయింపు ఉంది. అవసరమైన భూమి అందుబాటులో ఉంది. సమీపంలోని విష్ణుపురం రైల్వే స్టేషన్ ద్వారా బొగ్గును రైలుమార్గంలో తరలించే అవకాశం ఉంది. విద్యుత్‌ను తరలించేందుకు అవసరమైన ఇవాక్యుయేషన్ వ్యవస్థను కూడా ప్రణాళిక చేశారు. యాదాద్రి ప్రారంభ ప్రణాళికల్లోనే వివిధ బొగ్గు సరఫరా మార్గాలను పరిగణించారు. సంబంధిత ప్రాజెక్టు, పర్యావరణ పత్రాల్లో సింగరేణి సహా దేశీయ బొగ్గుతో పాటు కాకినాడ, కృష్ణపట్నం వంటి రేవుల ద్వారా దిగుమతి చేసుకునే బొగ్గును కూడా పరిగణించారు. రైల్వే రవాణా కూడా సరఫరా వ్యవస్థలో భాగమే.జి--9 గ్రేడ్ బొగ్గును సింగరేణి నిరంతరం, అవసరమైన పరిమాణంలో సరఫరా చేయగలదా అన్నదే అసలు ప్రశ్న. సింగరేణిలో తగినంత జి--9 బొగ్గు లభించకపోతే మహానది కోల్‌ఫీల్డ్స్, కోల్ ఇండియా వంటి సంస్థల నుంచి బొగ్గును సమీకరించాల్సి రావచ్చని ప్రభుత్వం చెబుతోంది. దీనివల్ల దాదాపు రూ.40వేల కోట్ల వరకు అదనపు భారం పడవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఇది పెద్ద విషయమే. అయితే, ఈ ఒక్క కారణంతో దామరచర్ల ఎంపిక తప్పు అని నిర్ధారించడం సరికాదు. దేశంలోని థర్మల్ విద్యుత్ రంగాన్ని పరిశీలిస్తే బొగ్గు గనుల పక్కనే అన్ని విద్యుత్ కేంద్రాలు ఉండవని అర్థమవుతుంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి లెక్కల ప్రకారం-- దేశంలో నమోదైన 188 బొగ్గు/ లిగ్నైట్ ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో కేవలం 22 మాత్రమే పిట్‌హెడ్ ప్లాంట్లుగా (బొగ్గు గనికి దగ్గరలో నిర్మితమైనవిగా) ఉన్నాయి. వాటి స్థాపిత సామర్థ్యం సుమారు 41,620 మెగావాట్లు. మిగిలిన 166 ప్లాంట్లు, అంటే దాదాపు 88 శాతం, పిట్‌హెడ్ కానివే. వాటి మొత్తం సామర్థ్యం సుమారు 1,71,055 మెగావాట్లు. అందువల్ల బొగ్గు గనులకు దూరంగా థర్మల్ విద్యుత్ కేంద్రం ఉండటం అసాధారణం కాదు. బొగ్గు రవాణా వ్యయం ముఖ్యమే కానీ అది ఒక్కటే నిర్ణయాత్మక అంశం కాదు.తెలంగాణలో విద్యుత్ డిమాండ్ ఉత్తర తెలంగాణలో మాత్రమే లేదు. హైదరాబాద్, రంగారెడ్డి పారిశ్రామిక ప్రాంతాలు రాష్ట్రంలోని అతిపెద్ద విద్యుత్ వినియోగ కేంద్రాల్లో ఉన్నాయి. ఉమ్మడి నల్లగొండలోని సిమెంట్, తయారీ పరిశ్రమలు, మహబూబ్‌నగర్ ప్రాంతంలోని పెరుగుతున్న పారిశ్రామిక, పట్టణ అవసరాలకు కూడా భారీగా విద్యుత్ అవసరం. అందువల్ల దక్షిణ, మధ్య తెలంగాణ వినియోగ కేంద్రాలకు కొంత సమీపంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉండటం వ్యవస్థపరంగా ప్రయోజనకరంగా ఉండవచ్చు. మరో ప్రాంతంలో విద్యుత్ ఉత్పత్తి చేసి హైదరాబాద్, దక్షిణ తెలంగాణకు తరలించాల్సి వస్తే ప్రసార మౌలిక వసతుల పెట్టుబడి, ప్రసార నష్టాలు, ట్రాన్స్‌మిషన్, వీలింగ్ చార్జీలు కూడా పరిగణనలోకి రావాలి. భూమి, నీరు, రైల్వేలు, బొగ్గు, ఇవాక్యుయేషన్, ప్రసారం, పర్యావరణం, ప్రధాన వినియోగ కేంద్రాలకు సామీప్యం-- ఇవన్నీ కలిపిన మొత్తం జీవితకాల వ్యయమే అసలు ప్రమాణం కావాలి. ఈ అంశాల్లో దామరచర్లకు ఉన్న ప్రయోజనాలు సుస్పష్టం.జి--9 బొగ్గు ఎంత అవసరం? సింగరేణి ఎంత సరఫరా చేయగలదు? కోల్ ఇండియా నుంచి తీసుకుంటే రవాణా వ్యయం ఎంత? బ్లెండింగ్ చేస్తే ఎంత? సముద్ర--రైలు మార్గం లేదా దిగుమతి బొగ్గు ఎంతవరకు ఆర్థికంగా ఉంటుంది? ఈ వివరాలను ప్రజల ముందుంచినప్పుడే ప్రభుత్వం పేర్కొంటున్న రూ.40,000 కోట్ల అదనపు భారం వాస్తవ స్వరూపం ఏమిటో స్పష్టమవుతుంది. యాదాద్రి తెలంగాణకు ఒక ప్రధాన విద్యుత్ ఆస్తి. గత ప్రభుత్వ నిర్ణయాలపై రాజకీయ భేదాభిప్రాయాలు ఉండవచ్చు. కానీ ఇప్పటికే భారీ పెట్టుబడులు పెట్టి నిర్మించిన ఈ ప్రాజెక్టును సమర్థవంతంగా నడపడం ప్రస్తుత ప్రభుత్వ బాధ్యత. విద్యుత్ కేంద్రం ఒక ఒంటరి కర్మాగారం కాదు. అది మొత్తం విద్యుత్ వ్యవస్థలో ఒక భాగం. దాని ఆర్థిక శాస్త్రం బొగ్గుతో ప్రారంభమవుతుంది. కానీ అక్కడితో ముగియదు. దామరచర్లలో యాదాద్రి ప్రాజెక్టు ఏర్పాటు చేయడం మౌలికంగా తప్పు అని ప్రభుత్వం భావిస్తే, అందుకు సంబంధించిన సాంకేతిక, ఆర్థిక ఆధారాలను ప్రజల ముందుంచాలి.

7-వా సైడ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ...





భద్రాచలం, నవంబర్ 07 నిర్భయ వార్త ప్రతినిధి భద్రాచలం ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 7-వా సైడ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వహకులు ఎమ్మెల్యే కి స్వాగతం పలికారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని, టోర్నమెంట్‌లో పాల్గొంటున్న జట్లకు శు భాకాంక్షలు తెలియజేశారు. క్రీడలు యువతలో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టుకృషి, స్నేహభావం, క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం ఫుట్‌బాల్ క్లబ్ నిర్వాహకులు, క్రీడాకారులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం డివిజన్ ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ



భద్రాచలం నవంబర్ 7 నిర్భయ వార్త ప్రతినిధి. భద్రాచలం రెవెన్యూ డివిజన్ పరిధిలో నివసిస్తున్న ప్రజలకు గిరిజన కుటుంభాలు ఆనందంగా దీపావళి పండుగ జరుపుకోవాలని వారికి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రినాలి శ్రేష్ఠ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మారుమూల ప్రాంతాలలో రెవెన్యూ డివిజన్ పరిధిలో మండల రెవెన్యూ కార్యాలయాలలో పనిచేస్తున్న తాసిల్దార్లు, సిబ్బంది ప్రజలందరు బాణాసంచా మందు గుండు సామాగ్రి, పటాకులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు వహించాలని తెలుపుతూ అందరికీ మరి ఒకసారి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఆయన అన్నారు.

ఇటుక బట్టీలపై అధికారుల మౌనం ఎందుకు.?

గత కథనం ప్రచురితమైన కథలని యంత్రాంగం.?
అనుమతులపై విచారణ ఏది చర్యలేవి.?
జిల్లా ఉన్నత అధికారుల జోక్యానికి ప్రజల డిమాండ్.?
మామూళ్ల అందుతున్నాయని ఆరోపణపై స్వతంత్ర విచారణ జరిగేనా.?
ఇసుక బూడిద తరలింపునకు సంబంధించిన ప్రభుత్వ ఆదాయ వివరాలపై విచారణ చేపట్టాలి.?
తాసిల్దార్ క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టకపోవడం పై ప్రశ్నలు.

పినపాక, నవంబర్ 7 నిర్భయ వార్త ప్రతినిధి. మండల పరిధిలోని ఏడూళ్ల బయ్యారం కేంద్రంగా కొనసాగుతున్న ఇటుక బట్టీల వ్యవహారం చర్చనీయాంశంగా మారుతోంది. మండల వ్యాప్తంగా సుమారు ఐదు ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నప్పటికీ, వాటికి సంబంధించిన అనుమతులు, ప్రభుత్వ నిబంధనల అమలుపై అధికారుల నుంచి స్పష్టత కరువైంది. ఈ వ్యవహారంపై గతంలో వార్తలు ప్రచురితమైనప్పటికీ సంబంధిత శాఖల అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



0ఇటుక బట్టీల నిర్వహణకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? పర్యావరణ, రెవెన్యూ శాఖల నిబంధనలు పాటిస్తున్నారా? అనే అంశాలపై ఇప్పటికీ స్పష్టత రావడం లేదు. ముఖ్యంగా తహసీల్దార్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి వాస్తవాలను వెల్లడించకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బట్టీల నిర్వహణకు సంబంధించిన అనుమతుల వివరాలను బహిర్గతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.మరోవైపు ఇటుక తయారీకి వినియోగిస్తున్న ఇసుక, బూడిద తరలింపునకు సంబంధించి ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుములు, ఇతర ఆదాయ వివరాలపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎలాంటి రుసుములు చెల్లించకుండా ఇసుక, బూడిద తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందా? అనే కోణంలో విచారణ జరపాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.ఇటుక బట్టీల నిర్వాహకుల నుంచి కొందరు అధికారులకు మామూళ్లు అందుతున్నాయనే ఆరోపణలు కూడా ప్రజల్లో వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవాలెంత అన్నది అధికారిక విచారణ ద్వారానే తేలాల్సి ఉంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సంబంధిత శాఖలతో సమగ్ర విచారణ జరిపిస్తారా? లేక గతంలో మాదిరిగానే ఈ వ్యవహారాన్ని పట్టించుకోకుండా వదిలేస్తారా? అన్నది వేచి చూడాల్సిందే.సమగ్ర తనిఖీలు చేపట్టి, అనుమతులు లేని బట్టీలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతోపాటు ప్రభుత్వ ఆదాయానికి సంబంధించిన లెక్కలను ప్రజల ముందుంచాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఏజెన్సీ ఏరియా లోని గిరిజనులకు, ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్



భద్రాచలం అక్టోబర్ 7 నిర్భయ వార్త ప్రతినిధి. దీపావళి పండుగను సంస్కృతికి ప్రతిబింబంగా జరుపుకునేది పండుగలని, వాటిలో ఆనందోత్సాహాలతో జాతి, మత, వర్గ విభేదాలను విస్మరించి సమైక్యంగా జరుపుకునే పండుగ దివ్య దీపాల దీపావళి అని ఈ పండుగను ఏజన్సీ ప్రాంతంలోని ప్రజలందరూ ఆనందంగా జరుపుకోవాలని వారికి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి. రాహుల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిలుగు వెలుగుల రంగుల దీపావళి చిన్న పెద్ద తేడా లేకుండా ఆనందంగా జరుపుకోవాలని, ముఖ్యంగా మారుమూల ప్రాంతాలలోని ఆదివాసి గిరిజన కుటుంబాలు దీపావళి పండుగను చాలా ఘనంగా జరుపుకుంటారని, ఈ పండుగకు ప్రత్యేకమైన ప్రాముఖ్యత ఉందని, నరకాసురుడు అనే రాక్షసుడిని సంహరించిన మరుసటి రోజు అతని పీడ వదిలిన ఆనందంతో ప్రజలు దీపావళి పండుగ చేసుకుంటారని అలాగే లంకలో రావణుని సంహరించిన శ్రీరాముడు సతీసమేతంగా అయోధ్యకు తిరిగి వచ్చినపుడు కూడా ప్రజలు ఆనందోత్సహాల మధ్య దీపావళి చేసుకున్నారని, చీకటిని పారదోలుతూ వెలుగులోనికి తెచ్చే పండుగగా విజయానికి ప్రతీకగా ప్రజలు దీపావళి పండుగను చేసుకుంటారని ఆయన తెలుపుతూ, గిరిజన సంక్షేమ శాఖ ఆధీనంలో పనిచేయుచున్న ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు కళాశాలలో విద్య నభ్యసిస్తున్న గిరిజన విద్యార్థిని విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు, ప్రిన్సిపాల్ లకు అదేవిధంగా ఏజెన్సీ ప్రాంతంలో పనిచేయుచున్న ఉద్యోగులకు వారి కుటుంబాలకు అందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నానని, ఈ పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని, ముఖ్యంగా పిల్లలు టపాసులు, బాణాసంచలు ఇతర మందు గుండు సామాగ్రి విషయంలో జాగ్రత్తలు పాటించేలా తల్లిదండ్రులు పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఆయన తెలుపుతూ మరి ఒకసారి అందరికి దీపావళి పండుగ శుభాకాంక్షలు అని ఆయన అన్నారు.

ధైర్య సాహసాలకు నిదర్శనం, నిస్వార్థ సేవకు వందనం

విపత్తులను ధైర్యంగా ఎదుర్కొని ప్రజలకు సేవలు అందించిన హీరోలకు ఘన సన్మానం భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ





భద్రాచలం నవంబర్ 7 నిర్భయ వార్త ప్రతినిధి. వర్షాకాలంలో భద్రాచలంలోని గోదావరి వరదలు అకస్మాత్తుగా ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండి తమ యొక్క విధులను మొక్కవోని ధైర్యంతో వరద ప్రాంతాలలో పనిచేసి ప్రజలకు వరదల బారి నుండి తన ఉద్యోగ ధర్మాన్ని ధైర్య సాహసాలతో నిర్వహించినందుకు వారిని ప్రత్యేకంగా అభినందించి సన్మానం చేయడం జరిగిందని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల శ్రేష్ఠ అన్నారు. శనివారం తన చాంబర్లో గోదావరి వరదలు, భారీ వర్షాలు, శ్రీరామ నవమి, ముక్కోటి, గణేశ నిమజ్జనం, దుర్గామాత విగ్రహాల నిమజ్జనం వంటి విపత్తు నహాయక చర్యల నమయంలో అంకితభావంతో పనిచేసిన ఫ్రంట్‌లైన్ సిబ్బంది,

– ఈతగాళ్లు: కుమ్మర సత్యనారాయణ, కారుకు ప్రసాద్

– పారిశుధ్య కార్మికులు, గ్రామ పంచాయతీ, భద్రాచలం: శ్రీమతి. సుడాల కౌసల్య, శ్రీమతి. సామంతుల పుష్ప

– ఆశా వర్కర్: . గొర్రెముచ్చు రమాదేవి, ఏ ఎం సి కాలనీ సబ్–సెంటర్

– హోంగార్డు: పానుగంటి రమేష్, అగ్నిమాపక కేంద్రం లలో పనిచేసే సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ఎటువంటి విపత్తులైన ధైర్యంగా ఎదుర్కొని ప్రజలను కాపాడుకుంటూ విధులు నిర్వహించిన సిబ్బందిని స్ఫూర్తిగా తీసుకొని మిగతా సిబ్బంది కూడా ఈ విధమైన సేవలు అందిస్తే గోదావరి వరదలలో ఎటువంటి ప్రాణ నష్టం కానీ ఆస్తి నష్టం కానీ జరగదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఏ ఓ భగవాన్ రెడ్డి మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంట్లో ఘనంగా దీపావళి వేడుకలు!

రావోజితండాలో లబ్ధిదారుడి ఇంట్లో ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమం



కారేపల్లి,నవంబర్ 7 నిర్భయవార్త రిపోర్టర్. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా సింగరేణి మండలం రావోజితండా గ్రామంలో ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుడు బానోతు బద్రు ఇంట్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి పోస్టర్‌ను ఆవిష్కరించారు. నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు నిర్వహించడం ద్వారా లబ్ధిదారుల కుటుంబంలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో రావోజితండా గ్రామ సర్పంచ్ భూక్య బాలుతో పాటు పంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ అనిల్ సిబ్బంది పాల్గొన్నారు.

టేకులగూడెంలో ఘనంగా అమరవీరుల సంస్మరణ సభ.

అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో నూతన ప్రజాస్వామిక సమాజ సాధనకు కృషి చేయాలి. -- మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య



కారేపల్లి నవంబర్ 7 నిర్భయవార్త రిపోర్టర్. సింగరేణి మండలం టేకులగూడెం గ్రామంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నవంబర్ 7న అమరవీరుల సంస్మరణ సభను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన అమరవీరులు కామ్రేడ్ స్వర్ణపాక లక్ష్మీనరసి, కామ్రేడ్ పాయం లక్ష్మీనారాయణతో పాటు ప్రజా ఉద్యమాల్లో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.మాస్‌లైన్ మండల కార్యదర్శి, టేకులగూడెం సర్పంచ్ గుమ్మడి సందీప్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభకు సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ గుమ్మడి నర్సయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ భూమి, భుక్తి, విముక్తి నినాదంతో 1969లో నక్సల్బరి ఉద్యమం నుంచి ప్రారంభమైన కమ్యూనిస్టు విప్లవోద్యమం శ్రీకాకుళం, గోదావరి లోయ, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ తదితర ప్రాంతాలకు విస్తరించిందన్నారు. భూస్వామ్య దోపిడీ, సామాజిక అసమానతలు, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడుతూ ఎంతోమంది విప్లవకారులు ప్రాణత్యాగాలు చేశారని, ప్రజల విముక్తి కోసం ప్రాణాలర్పించిన వారంతా విప్లవోద్యమ చరిత్రలో అరుణతారలుగా నిలిచిపోయారని కొనియాడారు. దేవులపల్లి వెంకటేశ్వరరావు, చంద్ర పుల్లారెడ్డి, తరిమెల నాగిరెడ్డి, కొల్లా వెంకయ్య, సత్యనారాయణ సింగ్, కాను సన్యాల్, చారు మజుందార్ తదితర ప్రముఖ నాయకులు విప్లవోద్యమ నిర్మాణానికి తమ జీవితాలను అంకితం చేశారని గుర్తుచేశారు. శ్రీకాకుళం, గోదావరి లోయ తదితర ప్రాంతాల్లో ప్రజా ఉద్యమాల కోసం ప్రాణత్యాగం చేసిన అనేకమంది అమరవీరుల సేవలను స్మరించుకున్నారు. ముఖ్యంగా టేకులగూడెం గ్రామానికి చెందిన కామ్రేడ్ స్వర్ణపాక లక్ష్మీనరసి, కామ్రేడ్ పాయం లక్ష్మీనారాయణలు ప్రజా ఉద్యమాల కోసం చేసిన త్యాగాలు గ్రామ ప్రజలకు, రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అరుణోదయ రామారావు, నాగన్న, ఏనుగుల వెంకన్న, జన్ను సార్, శ్రీశైలం తదితరులు కూడా ప్రజా ఉద్యమాల్లో అమరులుగా నిలిచారని తెలిపారు. పేద ప్రజల కష్టాలు, కన్నీళ్లు తొలగించి సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణం కోసం అమరవీరులు కన్న కలలను సాకారం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వారి త్యాగాలను స్మరించుకోవడమే కాకుండా ప్రజల హక్కుల సాధన, సామాజిక న్యాయం కోసం ప్రజలను చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించాయని విమర్శించారు. పేదలు, రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమరవీరుల పోరాట స్ఫూర్తితో నూతన ప్రజాస్వామిక సమాజ సాధన లక్ష్యంగా ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సభలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు గుగులోతు తేజ నాయక్, ప్రగతిశీల యువజన సంఘం (ూూూ) రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వి. రాకేష్, ఒఖజ× సంయుక్త మండల కార్యదర్శి ధరావత్ సక్రు ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు కొలిసెలం శ్రీను, స్వర్ణపాక అనసూర్య, రామారావు, గుమ్మడి ఎర్రయ్య, నాగేశ్వరరావు, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఐటీడీఏ గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

ఐటిడిఏ పిఓ బి.రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ



భద్రాచలం నవంబర్ 7 నిర్భయ వార్త ప్రతినిధి. తేదీ 09 నవంబర్ 26 సోమవారం భద్రాచలం ఐ టి డి ఏ, సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్న గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు, డివిజన్ అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ శనివారం సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనులు ప్రజలు వారి వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదును అందజేయాలని వారు తెలుపుతూ సంబంధిత యూనిట్ అధికారులు, డివిజన్ అధికారులు ఉదయం 10.30 గంటలకు భద్రాచలం ఐటీడీఏ మరియు సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరాలలో తప్పకుండా హాజరుకావాలని వారు పేర్కొన్నారు.

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు.. ఈ ఏడాది వరి సాగుకు దూరంగా ఉండాలి..

తాగునీరు, పశువుల అవసరాలకే తాలిపేరు ప్రాజెక్టు నీటిని వినియోగించుకోవాలి -- ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కి వినతిపత్రం





భద్రాచలం, నవంబర్ 07 నిర్భయ వార్త ప్రతినిధి. భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు ని కలిసి ప్రాజెక్టు నీటి వినియోగం, సాగునీటి పరిస్థితులు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వినతిపత్రం అందజేశారు.ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి లభ్యత తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, తాలిపేరు ప్రాజెక్టు పరిధిలో ఈ సంవత్సరం ఎట్టి పరిస్థితుల్లోనూ వరి సాగు చేపట్టకూడదని ఇరిగేషన్ శాఖ అధికారులు, సంబంధిత ప్రతినిధులు సూచించారు. వరి సాగు చేపడితే నీటి కొరత ఏర్పడి ఇతర పంటలకు, రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని తెలిపారు.ఈ నేపథ్యంలో రైతులు పరిస్థితులను అర్థం చేసుకొని ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సంవత్సరం తాలిపేరు ప్రాజెక్టులో అందుబాటులో ఉన్న నీటిని కేవలం తాగునీటి అవసరాలకు, పశువుల తాగునీటికి, పశుగ్రాసం సాగు అవసరాలకు మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. నీటిని పొదుపుగా వాడుకుంటూ భవిష్యత్తులో తలెత్తే నీటి ఎద్దడి సమస్యలను నివారించేందుకు రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవో జానీ, చర్ల తిరుపతి, భాగ్యరాజు రాథోడ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి మండల ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన భూక్య రంజిత్ కుమార్

ప్రతి ఇంటా ఆనందాల కాంతులు విరజిమ్మాలి.. చీకట్లను తొలగించి వెలుగులు నింపే దీపావళి కావాలి



భూక్య రంజిత్ కుమార్ మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

కారేపల్లి, నవంబర్ 7 నిర్భయవార్త రిపోర్టర్. చెడుపై మంచి సాధించిన విజయానికి, చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, గాదేపాడు గ్రామ సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ ఆకాంక్షించారు.దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని సింగరేణి మండలంలోని 41 గ్రామపంచాయతీల సర్పంచులు, ప్రజలకు ఆయన హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో దీపావళి పండుగకు విశిష్టమైన స్థానం ఉందని పేర్కొన్నారు. దీపావళి కేవలం దీపాలు వెలిగించే పండుగ మాత్రమే కాకుండా కుటుంబ బంధాలు, ఆత్మీయతలు, సోదరభావం, ఐక్యతను చాటిచెప్పే గొప్ప పర్వదినమని అన్నారు.ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, పేద, ధనిక అనే తేడా లేకుండా అందరూ సంతోషంగా పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా పేద కుటుంబాలకు చేతనైన సహాయం అందిస్తూ వారి జీవితాల్లోనూ ఆనందపు వెలుగులు నింపాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా దీపావళి వేడుకల్లో బాణసంచా కాల్చే సమయంలో చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పర్యావరణానికి హాని కలగకుండా, ఇతరులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు పాటిస్తూ పండుగను సురక్షితంగా జరుపుకోవాలని సూచించారు.ఈ దీపావళి ప్రతి కుటుంబానికి ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు, అభివృద్ధిని అందించాలని, సింగరేణి మండలంలోని 41 గ్రామపంచాయతీల ప్రజలందరూ సిరిసంపదలతో, సంతోషాలతో వర్ధిల్లాలని

ఖమ్మం జోన్ క్రికెట్ విజేతగా ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల.

రెండో స్థానంలో యూసీఈ కొత్తగూడెం.. 10 పరుగుల తేడాతో విజయం సాధించిన ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ జట్టు



ఖమ్మం నవంబర్ 7 నిర్భయవార్త రిపోర్టర్. నగరంలోని డెక్కన్ క్రికెట్ మైదానాల్లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న కాకతీయ విశ్వవిద్యాలయం ఖమ్మం జోన్ అంతర్ కళాశాల క్రికెట్ పోటీలు శనివారం ముగిశాయి. హోరాహోరీగా సాగిన ఫైనల్ పోటీలో ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల జట్టు విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. యూసీఈ కొత్తగూడెం జట్టు ద్వితీయ స్థానంతో సరిపెట్టుకుంది. ఫైనల్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల జట్టు నిర్ణీత ఓవర్లలో 91 పరుగులు చేసి నాలుగు వికెట్లు కోల్పోయింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన యూసీఈ కొత్తగూడెం జట్టు గట్టి పోటీ ఇచ్చినప్పటికీ లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. దీంతో 10 పరుగుల తేడాతో ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ జట్టు విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకుంది.అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఖమ్మం జోన్ క్రీడల కార్యదర్శి డాక్టర్ బి. వెంకన్న హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విజేత ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల క్రికెట్ జట్టును అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీలు డాక్టర్ కోటయ్య, గోపికృష్ణ, జే. ఉపేందర్, ఎం.డి. మతిన్ తదితరులు పాల్గొన్నారు.

వైరా నియోజకవర్గ ప్రజానీకానికి దీపావళి శుభాకాంక్షలు...

వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్.

ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు నిండాలి.. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి.



వైరా, నవంబర్ 7 నిర్భయవార్త రిపోర్టర్. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దీపావళి పర్వదినం వైరా నియోజకవర్గ ప్రజల జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ ఆకాంక్షించారు. దీపావళి పండుగను పురస్కరించుకుని నియోజకవర్గంలోని ప్రజలందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దీపావళి భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ముఖ్యమైన పండుగ అని పేర్కొన్నారు. చీకటిని తొలగించి వెలుగులు నింపే ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆశలు, ఆనందాలు, అభివృద్ధిని తీసుకురావాలని అన్నారు.ప్రజల మధ్య ప్రేమాభిమానాలు, సోదరభావం, ఐక్యత మరింత బలపడాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. పండుగను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కోరారు.అదేవిధంగా బాణసంచా కాల్చే సమయంలో చిన్నారులు, పెద్దలు తగిన జాగ్రత్తలు పాటించాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ సురక్షితంగా దీపావళి వేడుకలు జరుపుకోవాలని సూచించారు.ఈ దీపావళి వైరా నియోజకవర్గంలోని ప్రతి ఇంటా సిరిసంపదలు, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓట్ల లెక్కింపు ప్రక్రియను పరిశీలించిన జిల్లా సాధారణ పరిశీలకులు ఎస్. నాగలక్ష్మి ఐఏఎస్

కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు, ఓట్ల లెక్కింపు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలన

నిర్భయవార్త ప్రతినిధి :విజయవాడ:మైలవరం లక్కిరెడ్డి లక్ష్మిరెడ్డి ఇండోర్ స్టేడియంలో శనివారం కొనసాగుతున్న



మైలవరం, రెడ్డిగూడెం మండలాలకు సంబంధించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు (జనరల్ అబ్జర్వర్) ఎస్. నాగలక్ష్మి ఐఏఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన వివిధ కౌంటింగ్ టేబుళ్లను సందర్శించి, ఓట్ల లెక్కింపు జరుగుతున్న తీరును పరిశీలించారు. కౌంటింగ్ సూపర్వైజర్లు, సహాయక సిబ్బంది విధుల నిర్వహణ, బ్యాలెట్ పత్రాల వర్గీకరణ, ఓట్ల లెక్కింపు విధానాలను అడిగి తెలుసుకున్నారు.ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ప్రతి దశలోనూ పూర్తి పారదర్శకత పాటించాలని, ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. కౌంటింగ్ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.అలాగే కౌంటింగ్ కేంద్రంలో భద్రతా ఏర్పాట్లు, అధికారులకు ఎన్నికల ఏజెంట్లకు కల్పించిన సౌకర్యాలు, కౌంటింగ్ హాళ్లలో నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియపై ఎలాంటి సందేహాలు, అభ్యంతరాలు తలెత్తకుండా నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియలో ఓట్ల లెక్కింపు అత్యంత కీలకమైన దశ అని, ఈ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని జిల్లా సాధారణ పరిశీలకులు అధికారులకు దిశానిర్దేశం చేశారు.పరిశీలకులు వెంట విజయవాడ ఆర్డీవో వెన్నెల శీను తదితరులు ఉన్నారు.

కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు

- ఇబ్రహీంపట్నం మండల ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓట్ల లెక్కింపు కేంద్రం సందర్శన
- కౌంటింగ్ ఏర్పాట్లు, సిబ్బంది విధుల నిర్వహణపై సమీక్ష
- పారదర్శకంగా, నిబంధనల మేరకు ఓట్ల లెక్కింపు చేపట్టాలని వ్యయ పరిశీలకులు బి.విజయ్ కుమార్ సూచన

నిర్భయవార్త ప్రతినిధి :విజయవాడ:కొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇబ్రహీంపట్నం మండల ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు బి. విజయకుమార్ శనివారం సందర్శించి కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓట్ల లెక్కింపు నిర్వహణ, కౌంటింగ్ సిబ్బంది విధులు, కేంద్రంలో కల్పించిన మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో సమీక్షించారు.ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎన్నికల



సంఘం నిబంధనలు, మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని, ప్రతి ఓటును జాగ్రత్తగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా లెక్కింపు చేపట్టాలని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ సమన్వయంతో విధులు నిర్వహించాలని తెలిపారు.

ప్రత్యేక కౌంటర్లలో ఏడు రకాల బియ్యం విక్రయాలు

కిలో రూ.47 నుంచి రూ.82 వరకు ధరలు..
ప్రజలకు నాణ్యమైన బియ్యం అందించడమే లక్ష్యం..... డిఎస్ఓ

నిర్భయవార్త ప్రతినిధి :మచిలీపట్నం ప్రతినిధి :కృష్ణా జిల్లాలోని వివిధ టోకు, చిల్లర వర్తక దుకాణాల్లో నాణ్యమైన ఏడు రకాల బియ్యం విక్రయించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా దుకాణాల యజమానులు ముందుకు రావడంతో ఈ విక్రయాలకు శ్రీకారం చుట్టారు. ఈ విషయాన్ని కృష్ణా జిల్లా పౌరసరఫరాల అధికారి టి శివరామప్రసాద్ వెల్లడించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని టోకు, చిల్లర వర్తక దుకాణాల్లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా బియ్యం విక్రయాలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్యాకింగ్ చేసిన బియ్యాన్ని నిర్ణయించిన ధరలకు ప్రజలకు అందించాలని ప్రభుత్వం సూచించినట్లు పేర్కొన్నారు. ధరలు పెంచడం, అధిక ధరలు వసూలు చేయడం వంటి చర్యలకు పాల్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.బియ్యం రకాలు -- కిలో ధరలు:। బియ్యం రకం । ధర ।।। బీపీటీ 3291 (సోనా) । ?66 ॥ బీపీటీ 5204 (సాంబ)। ?66 ॥ కేఎన్ఎం । ?66 ॥ హెచ్ఎంటీ। ?76 ॥ ఆర్ఎన్ఆర్ । ?76 ॥ జై శ్రీరామ్। ?82 ॥ ఎంటీయూ కాటన్ వెరైటీ । ?47 ।ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని అందుబాటు ధరల్లో విక్రయించడమే ఈ ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలని, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని దుకాణదారులకు సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ పాటించాలని పౌరసరఫరాల శాఖ అధికారులు కోరారు.



కుటుంబ సమేతంగా ఇంద్రకీలాద్రి అమ్మవారిని దర్శించుకున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్

నిర్భయవార్త ప్రతినిధి :విజయవాడ:ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీషా, ఐ ఏ స్,తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం ఇంద్రకీలాద్రిపై వెలిసిన శ్రీ కనకదుర్గ అమ్మవారిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తన ధర్మపత్ని మరియు మాతృమూర్తితో కలిసి ఆలయా నికి చేరుకోగా, ఆలయ అధికారులు, ఈఓ మరియు అర్చకులు వారికి సాదర స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం అందించి, అమ్మవారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాన్ని బహూకరించారు.



దీపావళి వెలుగుల పండుగ కావాలి.. ప్రమాదాలకు నిలయంగా మారకూడదు:జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ



నిర్భయవార్త ప్రతినిధి :విజయవాడ: నవంబర్ 7, 2026.:దీపావళి పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాల మధ్య సురక్షితంగా జరుపుకునేలా టపాసుల దుకాణాల ఏర్పాట్లు, భద్రతా నిబంధనల అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు.టపాసుల విక్రయాల కంటే ప్రజల ప్రాణ భద్రతకే అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. విజయవాడ కలెక్టరేట్‌లోని ఏవీఎస్ రెడ్డి సమావేశ మందిరంలో శనివారం రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక తదితర శాఖల అధికారులతో దీపావళి టపాసుల దుకాణాల ఏర్పాట్లు, భద్రతా చర్యలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒకే ప్రాంగణంలో గరిష్టంగా 50 దుకాణాలకు మాత్రమే అనుమతి ఇవ్వాలని, ప్రతి దుకాణం మధ్య కనీసం మూడు మీటర్ల ఖాళీ స్థలం ఉండేలా చూడాలన్నారు. దుకాణాలను 'ఖ' ఆకారంలో ఏర్పాటు చేయాలని, నివాస ప్రాంతాలు, అధిక జనసంచారం ఉండే ప్రాంతాలకు దూరంగా ఏర్పాటు చేయాలని సూచించారు. అగ్నినిరోధక నిర్మాణ సామగ్రితో షెడ్లు నిర్మించాలని, నాణ్యమైన విద్యుత్ వైరింగ్ ఏర్పాటు చేయాలని, దుకాణాల వద్ద దీపాలు, లాంతర్లు ఉపయోగించరాదని, టపాసుల డెమో లేదా టెస్ట్ నిర్వహించరాదని స్పష్టం చేశారు. ప్రతి దుకాణం వద్ద నీరు, ఇసుక బకెట్లు, అగ్నిమాపక యంత్రాలు అందుబాటులో ఉంచాలని, అత్యవసర పరిస్థితుల్లో 30 సెకన్లలోపు స్పందించేలా సిబ్బందిని సిద్ధంగా ఉంచాలన్నారు. సమీపంలో అంబులెన్సులు, ఫైర్ ఇంజిన్లు అందుబాటులో ఉండాలని, దుకాణాలకు కనీసం 50 మీటర్ల దూరంలో పటాకులు కాల్చే ప్రత్యేక ప్రాంతాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. టపాసుల విక్రయ ప్రాంగణాల్లో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖల సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి 10 నిమిషాలకు మైక్ ద్వారా భద్రతా సూచనలు ప్రసారం చేయాలని, టపాసులు కొనుగోలు చేసే ప్రతి వినియోగదారుడికి తెలుగు, ఆంగ్ల భాషల్లో భద్రతా జాగ్రత్తల కరపత్రాలు అందించాలని ఆదేశించారు. అనుమతించిన పరిమితికి మించి టపాసుల నిల్వలు ఉంచరాదని, దుకాణాలు, గోదాములపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ఆర్డీవోలు, పోలీస్, అగ్నిమాపక శాఖ అధికారులు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం దుకాణాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యాపారులకు అనుమతుల జారీలో ఇబ్బందులు లేకుండా ఆర్డీవో కార్యాలయాల్లో సింగిల్ విండో విధానాన్ని అమలు చేసి, జీఎస్టీ, పోలీస్, అగ్నిమాపక శాఖలకు సంబంధించిన అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలు పర్యావరణహితమైన టపాసులను వినియోగించాలని కలెక్టర్ కోరారు. అధిక శబ్దాలు వచ్చే టపాసుల వల్ల వృద్ధులు, హృద్రోగులు, చిన్నపిల్లలు, పక్షులు, జంతువులకు ఇబ్బందులు కలుగుతాయని, శబ్ద కాలుష్యానికి బదులుగా కాంతులు విరజిమ్మే టపాసులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. దీపావళిని ప్రమాదరహితంగా జరుపుకునేందుకు ప్రజలు, వ్యాపారులు బాధ్యతగా వ్యవహరించాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో డీఆర్ఓ ఎం. లక్ష్మీనరసింహం, డీసీపీ అడ్మిన్ కేజీవి సరిత, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఏ.వి శంకరరావు, వివిధ అడిషనల్ కమిషనర్ ఏ.రవీందర్ రావు, వివిధ డివిజనల్ ఫైర్ ఆఫీసర్ సిహెచ్ రత్నబాబు, ఆర్డీవోలు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ఆర్‌విఆర్ ఎన్ఆర్ఐ విశ్వవిద్యాలయంలో సహస్ర దీపపు కాంతులు









నిర్భయవార్త ప్రతినిధి :ఆగిరిపల్లి, నవంబర్ 07: డాక్టర్ ఆర్‌విఆర్ ఎన్ఆర్ఐ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (డీమ్డ్ టు బి యూనివర్సిటీ)లో మొదటి సంవత్సర విద్యార్థిని విద్యార్థుల ఆహ్వాన వేడుక (ఫ్రెషర్స్ డే) అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సంబరంలో రెండు వేల మందికి పైగా విద్యార్థులు అత్యంత ఉత్సాహంతో పాల్గొని వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో నందడి చేశారు.ప్రొఫెసర్ రమేష్ శ్రీకొండ గారు (డైరెక్టర్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, విజయవాడ) ఈ మహోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ ఇటువంటి వేడుక ప్రతి విద్యార్థి జీవితంలో ఒక మరవురాని అనుభూతిని ఇస్తుందని అన్నారు. విద్యార్థులు పెద్ద పెద్ద లక్ష్యాలు పెట్టుకుని కలలు కనాలని అన్నారు. అలాంటి కలల నుంచే కొత్త ఆలోచనలు పుడతాయని, ఆ ఆలోచనలే సృజనాత్మకతకు దారితీస్తాయని తెలిపారు. ఇలా ఆలోచించే విధానము విద్యార్థి దశలో అలవర్చుకుంటే తద్వారా దేశంలో స్వతంత్రంగా పనిచేసే నైపుణ్యం సంపాదిస్తారని, అది అత్యున్నత భారతదేశానికి అడుగులు వేయడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. కేవలం డిగ్రీతోనే ఆగకుండా సృజనాత్మకతను అభివృద్ధి చేసే దృక్పథం విద్యార్థుల్లో పెంపొందాలని కూడా సూచించారు. విశిష్ట అతిథిగా ప్రొఫెసర్ ఎం.ఎల్.ఎన్. రావు గారు (చాన్సలర్ డ వైస్ చాన్సలర్, రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ -- ఏపీ) మాట్లాడుతూ ఎన్ఆర్ఐ విశ్వవిద్యాలయం వంటి మంచి సంస్థలో విద్యను ప్రారంభించినందుకు విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. ప్రస్తుతం ఏపీ, ఎంఎల్, కంప్యూటర్ రంగాల్లో సాంకేతికత అతి వేగంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. రాబోయే అయిదు నుంచి పది ఏళ్లలో ఈ రంగాల్లో అత్యుత్తమ ఆవిష్కరణలు, పురోగతి కనిపిస్తాయని చెప్పారు. ఈ సాంకేతిక మార్పులో భాగస్వాములవ్వడమే 2047, వికసిత్ భారత్ 2047కు తోడ్పడాలని విద్యార్థులను ప్రోత్సహించారు.గౌరవనీయులైన డాక్టర్ ఆర్‌విఆర్ ఎన్ఆర్ఐ విశ్వ విద్యాలయ చైర్మన్ మరియు చాన్సలర్ డా. రవి వెంకటరావు గారు తమ ఉపన్యాసంలో విద్యార్థులు జీవన ప్రయాణంలో ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కోవాలో చక్కటి సూక్తులతో వివరించారు. అలాగే ఎన్ఆర్ఐ విశ్వవిద్యాలయంలో నాలుగేళ్ల చదువు కేవలం డిగ్రీ ఇవ్వడమే కాకుండా, విద్యార్థుల సర్వతోముఖ కలిగిన సమాజానికి ఉపయోగపడగల బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెప్పారు.సభాధ్యక్షులు డా. కె.ఆర్.ఎస్. సాంబశివరావు గారు (వైస్ ఛాన్సలర్) అధ్యక్షోపన్యాసంలో మాట్లాడుతూ, ఈ ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయంలో చేరినందుకు విద్యార్థులంతా అదృష్టవంతులని అన్నారు. విశ్వవిద్యాలయంలో అనుసరిస్తున్న వినూత్నమైన బోధనా విధానాన్ని సద్వినియోగం చేసుకుని, వట్టా పొందే నమయానికి పరిశ్రమలకు, సమాజానికి ఉపయోగపడే విద్యావంతులుగా తయారు కావాలని ప్రోత్సహించారు.నిర్వహణా అధ్యక్షులుగా డా. డి. సునీత గారు (డీన్), సీఈఓ, ప్రో వైస్ చాన్సలర్లు, రిజిస్ట్రార్, డీన్స్, విభాగాధిపతులు, ఇతర ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు తమ విలువైన సందేశం అందించారు.విద్యార్థుల మనసును అనే ప్రమిదలో చిత్తశుద్ధి, ఏకాగ్రత అనే వత్తులు సమయం అనే నూనెలో నానినవి కాగా, ఈ వేడుక మీద ఉన్న పెద్దల నోటినుండి వెలువడిన వాక్యాల కాంతితో ఆ దీపాలు వెలిగాయి. ఈ దీపపు వెలుగులు విద్యార్థుల జీవన గమనానికి ఎల్లప్పుడూ మార్గదర్శకం కావా లని ఆకాంక్షిస్తూ... అందరికీ దీపావళి శుభాకాంక్షలు!గమనిక: ఇది చిత్రాల్లో కనిపిస్తున్న పాఠ్యానికి ఆధారంగా చేసిన టైపింగ్. కొన్ని చోట్ల అక్షరాలు స్పష్టంగా లేకపోవడంతో పేర్లు, హోదాలు మరియు కొన్ని వాక్యాలను అసలు పత్రంతో మరోసారి సరిపోల్చుకోవడం మంచిది.

రాష్ట్రానికి 6 జాతీయ స్థాయి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు

స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్

నిర్భయవార్త ప్రతినిధి :అమరావతి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, పురపాలక శాఖ, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణల సలహా, సూచనలతో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ నాయకత్వంలో ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్రంలో పెద్ద ఎత్తున సాగుతున్న 'స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర' ఉద్యమ ఫలితంగా రాష్ట్రానికి ఆరు ప్రతిష్టాత్మకమైన జాతీయ అవార్డులు లభించాయి. జాతీయ స్థాయి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డ్స్ లో మన రాష్ట్రంలోని విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరువతి, రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్లకు, కుప్పం మున్సిపాల్టీకి కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డులు ప్రకటించింది. రాష్ట్రానికి ఆరు ప్రతిష్టాత్మకమైన జాతీయ అవార్డ్స్ దక్కడం ఎంతో గర్వకారణం అని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. 'స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర' ఉద్యమం ద్వారా రాష్ట్రంలో పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణలో గణనీయమైన మార్పులు వచ్చాయన్నారు. ప్రజల భాగస్వామ్యం, మున్సిపల్ యంత్రాంగాల నిరంతర కృషితో జాతీయ స్థాయిలో ఈ స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డులు లభించాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ నెల 11న ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ అవార్డులు ప్రధానం చేస్తారని తెలిపారు. ఈ అవార్డ్స్ సాధించడంలో ఎనలేని కృషి చేసిన శానిటరీ వర్కర్స్ కి ముందుగా తన హృదయపూర్వక ధన్యవాదాలు, అభినందనలు తెలిపారు. సహకరించిన వివిధ స్థాయిలలోని అధికారులకు , ఉద్యమంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు, శుభాకాంక్షలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో స్వచ్ఛ ఆంధ్ర ఉద్యమాన్ని మరింత ఉధృతంగా కొనసాగిద్దామని పట్టాభిరామ్ పిలుపు ఇచ్చారు.



ఘనంగా అనాథ, పేద పిల్లలకు అల్పాహార వితరణ

దీపావళి వేళ కృష్ణ గోపాల్ సేవా సమితి ఆదర్శనీయ సేవలు



నిర్భయవార్త ప్రతినిధి : వనస్థలిపురం:

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం పేద, అనాథ పిల్లలకు ఉచిత అల్పాహార (టిఫిన్) వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.



ఈ సేవా కార్యక్రమంలో సుమారు 300 మందికి పైగా చిన్నారులు పాల్గొని సంతోషంగా అల్పాహారాన్ని స్వీకరించారు. పండుగ పూట తమకు కడుపు నిండా రుచికరమైన అల్పాహారం అందించినందుకు చిన్నారులు నిర్వాహకులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతూ, దీపావళి శుభాకాంక్షలు అందజేశారు. ఈ సందర్భంగా సమితి ప్రెసిడెంట్ డాక్టర్ కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ.. పండుగల వేళ పేదలు, అనాథల ముఖాల్లో చిరునవ్వులు పూయించడమే నిజమైన దీపావళి అని అన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు చేతనైన సాయం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కృష్ణ గోపాల్ సేవా సమితి ద్వారా నిరంతరం ఇలాంటి పరోపకార, సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఎవరైనా దాతలు సమితి ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించాలనుకుంటే తమను సంప్రదించవచ్చని తెలిపారు. అనంతరం ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణ గోపాల్ సేవా సమితి ప్రతినిధులు, సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

కేంబ్రిడ్జ్ మాంటిస్సోరి స్కూల్‌లో ఘనంగా గ్రీన్ దీపావళి వేడుకలు



నిర్భయవార్త ప్రతినిధి :హనుమకొండ:

పర్యావరణ పరిరక్షణ, కాలుష్యరహిత దీపావళి ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేసే లక్ష్యంతో గోపాల్‌పూర్‌లోని కేంబ్రిడ్జ్ మాంటిస్సోరి ఇంటర్నేషనల్





స్కూల్‌లో గ్రీన్ దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా “గ్రీన్ దీపావళి -- పర్యావరణ హితమే మా లక్ష్యం” అనే నినాదంతో పలు కార్యక్రమాలు చేపట్టారు. సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారులు చిత్రలేఖనం, కళాకృతులు, హస్తకళల ద్వారా తమ సృజనాత్మకతను చాటుకున్నారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే ప్రచార వీడియోలను రూపొందించి ప్రదర్శించారు. మట్టి ప్రమిదల వినియోగం, బాణసంచాకు దూరంగా ఉండటం, మొక్కలు పెంచడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ పీజీ హెచ్ఎం నాగేశ్వర్ రావు ఇలి విద్యార్థులను అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రావణి తాబేటి మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లల్లో పర్యావరణ బాధ్యతను పెంపొందించడం అవసరమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని నాగేశ్వర్ రావు అన్నారు. అనంతరం పాఠశాల బోధన, బోధనేతర సిబ్బందికి దీపావళి మిఠాయిలు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులు దివ్య, మౌనిక, కావ్య, అమని, ఆయేషా, సమ్రీన్, శ్రావణి, రావళి, ఉమారాణి తదితరులు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

సాయి రూప ట్రస్ట్‌ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమం





నిర్భయవార్త ప్రతినిధి : వేములవాడ :

వేములవాడ పట్టణంలోని ఈరోజు మధ్యాహ్నం నిరాశ్రయులకు ఆకలితో అలమటిస్తున్న అన్నార్తులకు, భక్తులకు అన్నప్రసాదం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాజన్న ఆలయం ఆవరణంలో సాయిరూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం రోజున అన్న ప్రసాదం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు పిల్లీ బాబురావు మాట్లాడుతు వారి పేరు మీద అన్న ప్రసాదం ఈ రోజు భక్తులకు పంపిణి చేయడం జరిగింది అలాగే ప్రతి దాతలకు పేరు పేరు నాధన్యవాదములు ఈ రోజు పురేల్ల వొజన్న జ్ఞాపకార్థం సందర్భంగా మాకు ఈ కార్యక్రమం సహకరించారు వారి కుమారుడు పురేల్ల గంగాధర్ వి ఆర్ ఫౌండేషన్ వాస్తవ్యులైనబొంబాయి ఈ కార్యక్రమం లో సాయి రూప ట్రస్ట్ వ్యవస్థాపకులు ఎద్దండిరాజు-సరళ,బోడిగేరాజు,గోంటినవీన్,వాసాలహరిప్రసాద్ , వేముల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రేస్ చిల్డ్రన్స్ స్కూల్‌లో ఘనంగా దీపావళి సంబరాలు, రెడ్ కలర్ డే

పూల రంగోలి, ప్రమిదల వెలుగులతో ఆకట్టుకున్న చిన్నారులు

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి: స్కూల్ డైరెక్టర్ అల్లం రత్నా రెడ్డి

నిర్భయవార్త ప్రతినిధి :అబ్దుల్లాపూర్‌మెట్:

కోహెడ గ్రేస్ చిల్డ్రన్స్ స్కూల్‌లో శనివారం దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని దీపావళి వేడుకలు, ‘రెడ్ కలర్ డే’ కార్యక్రమాలను అత్యంత ఘనంగా, వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ పండుగ శోభతో పాటు చిన్నారుల ఉత్సాహంతో సందడిగా మారింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎరుపు రంగు దుస్తులు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పాఠశాలలో చిన్నారులు బంతిపూలతో తీర్చిదిద్దిన ఆకర్షణీయమైన పూల రంగోలి, మధ్యలో వెలిగించిన దీపపు ప్రమిదలు, “హ్యాపీ దివాళి టు ఆల్” అంటూ రూపొందించిన ప్రత్యేక చార్ట్ బోర్డులు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ అల్లం రత్నా రెడ్డి మాట్లాడుతూ.. భారతదేశం పండుగలకు, విశిష్ట సంప్రదాయాలకు పుట్టినిల్లని అన్నారు. దీపావళి అంటే కేవలం బాణసంచా కాల్చడం మాత్రమే కాదని, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని, సమాజంలో నెలకొన్న అజ్ఞానమనే చీకట్లను పారద్రోలి విజ్ఞానపు వెలుగులు నింపడమే ఈ పండుగ పరమార్థమని పేర్కొన్నారు. విద్యార్థులకు చిన్ననాటి నుంచే భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువల ప్రాముఖ్యతను నేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందన్నారు. పుస్తకాల్లోని చదువుతో పాటు ప్రాక్టికల్ పరిజ్ఞానం పెంపొందించేందుకు ‘కలర్స్ డే’ వంటి వినూత్న కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, ఎరుపు రంగు ప్రేమ, ధైర్యం, ఉత్సాహానికి నిదర్శనమని వివరించారు. విద్యార్థులంతా పర్యావరణానికి హాని కలగకుండా హరిత దీపావళి (గ్రీన్ దివాళి) జరుపుకోవాలని, తగిన జాగ్రత్తలు పాటిస్తూ సురక్షితంగా వేడుకలు చేసుకోవాలని రత్నారెడ్డి



సూచించారు. ఈ వేడుకల్లో భాగంగా చిన్నారులు ఉపాధ్యాయులతో కలిసి సంప్రదాయ రీతిలో దీపాలు వెలిగించి ముందస్తు దీపావళి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె. మహేశ్వర్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏవో) జైపాల్ రెడ్డి, ఏవో శివ, క్యాంపస్ మేనేజర్ మరీని చంద్రశేఖర్, రెసిడెన్షియల్ కో-ఆర్డినేటర్ డి. కిరణ్ బాబు, సోషల్ స్టడీస్ సీనియర్ టీచర్ తోటపల్లి ఆశీర్వాదం, సోషల్ సైన్స్ విభాగం సైరా బాను, ఇంగ్లీష్ విభాగ ఉపాధ్యాయులు వెంకటేష్, రాజేంద్ర, నరేష్, రిసెప్షనిస్ట్ కల్పన, హాస్టల్ వార్డెన్లు, సీనియర్ ఉపాధ్యాయులు, బోధన మరియు బోధనేతర సిబ్బందితో పాటు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పల్లవి మోడల్ స్కూల్‌లో ముందస్తు దీపావళి వేడుకలు

విద్యార్థులకు దీపావళి పండుగ విశిష్టతపై అవగాహన

సంప్రదాయాలు, ఆచారాలపై ప్రత్యేక వివరణ

దీపం,ఓం,స్వస్తిక్, పీఎంఎస్ ఆకృతులతో విద్యార్థుల కనువిందు

చెడుపై మంచి, చీకటిపై వెలుగు విజయానికి ప్రతీక దీపావళి

ఆనందంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

పాఠశాల చైర్మన్ రాచకొండ అశోక్ చారి



నిర్భయవార్త ప్రతినిధి పర్వతగిరి: పర్వతగిరి మండలం అన్నారం గ్రామంలోని పల్లవి మోడల్ స్కూల్‌లో ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దీపావళి పండుగ ప్రాముఖ్యత, దాని వెనుక ఉన్న ఉద్దేశం, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రాచకొండ అశోక్ చారి మాట్లాడుతూ దీపావళి వెలుగుల పండుగ అని, చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటామని తెలిపారు. దీపాలు వెలిగించడం ద్వారా ఇళ్లలోనే కాకుండా మన ఆలోచనల్లోనూ మంచి వెలుగును నింపుకోవాలని విద్యార్థులకు సూచించారు. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలు, కుటుంబ బంధాలను గుర్తు చేస్తాయని పేర్కొన్నారు.చదువుతో పాటు మన పండుగల విశిష్టత, వాటి వెనుక ఉన్న సందేశాలు, ఆచారాల గురించి కూడా విద్యార్థులు తెలుసుకోవడం అవసరమని పాఠశాల యాజమాన్యం తెలిపింది. పెద్దలు పాటించే మంచి సంప్రదాయాలను గౌరవిస్తూ, వాటి ప్రాముఖ్యతను అర్థం చేసుకోవాలని సూచించారు. దీపావళి వేడుకలను ఆనందంగా, బాధ్యతాయుతంగా జరుపుకోవడంతో పాటు పర్యావరణం, ఇతరుల భద్రతను దృష్టిలో ఉంచుకోవాలని వివరించారు.ఈ సందర్భంగా విద్యార్థులు దీపం, ఓం, స్వస్తిక్, పీఎంఎస్ ఆకృతులను అందంగా రూపొందించి అందరినీ ఆకట్టుకున్నారు. విద్యార్థులు పండుగ విశేషాలను ఆసక్తిగా తెలుసుకుంటూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గంజి మహేందర్, డైరెక్టర్ కొటగిరి రమేష్, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంట్లో వెలిగే ప్రతీ దీపం ప్రజాప్రభుత్వ సంకల్పానికి ప్రతీక కావాలి...

అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులందరూ భాగస్వాములు కావాలి...

ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి దిశానిర్దేశం...


ఎంపీడీవోలు, సెక్రటరీలు, జీపీవోలతో ఎమ్మెల్యే వర్చువల్ మీటింగ్...

నిర్భయవార్త ప్రతినిధి :అబ్దుల్లాపూర్‌మెట్:

“మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి’ పేరుతో లబ్ధిదారుల నివాసాల్లో వెలిగించే ప్రతీ దీపం ప్రజాప్రభుత్వ సంకల్పానికి ప్రతీక కావాలని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. దీపావళిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన ఈ కార్యక్రమంపై శనివారం తొర్రూర్ క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో ఎమ్మెల్యే వర్చువల్‌గా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఎంపీడీవోలు, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, జీపీవోలు పాల్గొనగా... వారికి మల్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. పేదప్రజల జీవిత స్వప్నం సాకారమైన వేళ... ప్రతీ లబ్ధిదారుడి కుటుంబంలో వెలుగులు నింపే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లలో దీపాలు వెలిగి, ప్రతి కుటుంబంలో పండగ ఆనందం కనిపించాలని తెలిపారు. పూర్తైన ప్రతీ ఇంటికి స్టిక్కర్ వేయాలన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, అంగన్‌వాడీ, ఆశా సిబ్బంది, ఇందిరమ్మ కమిటీల సభ్యులంతా ఊరూవాడన ఇందిరమ్మ ఇళ్లలో జరిగే దీపావళి వేడుకల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, బిల్లుల విషయంలో ఎలాంటి జాప్యం లేకుండా పారదర్శకతతో ముందుకుసాగుతున్నట్లు మల్‌రెడ్డి చెప్పారు

తెలంగాణ ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు

తెలంగాణ గిరిజన సమైక్య రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బానోత్ బిక్షం నాయక్



నిర్భయవార్త ప్రతినిధి :అబ్దుల్లాపూర్‌మెట్:

తెలంగాణ ఎస్టీ, ఎస్సీ కమిషన్ చట్టం 2003ను రద్దు చేస్తూ 2026 చట్టం తీసుకురావడం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల తెలంగాణ గిరిజన సమైక్య హర్షశీ వ్యక్తం చేసింది.ఎస్సీ ఎస్టీ కమిషన్లను వేర్వేరు ఏర్పాటు చేయడం చారిత్రక నిర్ణయమని తెలంగాణ గిరిజన సమైక్య రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బానోత్ బిక్షం నాయక్ అన్నారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దశాబ్దాలుగా గిరిజన సంఘాలు చేస్తున్న డిమాండ్ ని గుర్తించి వారి అంశాలను అనుగుణంగా వేర్వేరు కమిషన్ల ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపినందుకు గిరిజన సమాజం కృతజ్ఞతలతో ఉంటుందని అన్నారు.దీని వలన పరదర్శకత ఉంటుందని,గిరిజనులు సమస్యల పరిష్కారానికి మార్గం సులభం అవుతుంది అని. అన్నారు. ఉమ్మడిగా ఉండటం వలన కొంత మేరకు ఎస్టిలకి కమిషన్ కి దూరం పెరిగిందని అందుకే గిరిజన సమాజము ప్రత్యేకమైన కమిషన్ కొరకు అనేక యేండ్లుగా పోరాటాలు నిర్వహిస్తుందని ఇప్పుడు ఆ పోరాట ఫలితం వచ్చిందని అన్నారు ప్రభుత్వం ఇంతటితో చేతులు దులుపుకోకుండా సమాజంలో చిన్న చూపుకి గురైతున్న గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం,వారి అభివృద్ధి కోసం కృషి చేయాలనీ, రాజకీయ ఉద్యోగం, ఉపాధి రంగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు గిరిజన జాతి ఆత్మ గౌరవంతో బతికే పరిస్థితులు రావాలని అన్నారు.

రాయచోటిలో కూటమిది చారిత్రాత్మక విజయం:

రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



నిర్భయవార్త ప్రతినిధి : అమరావతి:రాష్ట్రవ్యాప్తంగా జరిగిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు ప్రజలు బ్రహ్మరథం పట్టారని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం రెండున్నరేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు పట్టం కట్టారని పేర్కొన్నారు. శనివారం అన్నమయ్య జిల్లా రాయచోటిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమి అభ్యర్థులు అఖండ మెజార్టీతో విజయం సాధిస్తున్నారని, ముఖ్యంగా రాయలసీమలో కూటమికి అనూహ్య ప్రజాదరణ లభించిందని తెలిపారు. ఈ విజయం కేవలం కూటమి ప్రభుత్వానిది మాత్రమే కాదని, ప్రజల విజయమని అభివర్ణించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఎన్నికలకు, ప్రస్తుత ప్రభుత్వంలో జరిగిన ఎన్నికలకు ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికలు నిర్వహించామని పేర్కొన్నారు.**రాయచోటి రాజకీయ చరిత్రలో సరికొత్త అధ్యాయం**రాయచోటి నియోజకవర్గ రాజకీయ చరిత్రలో కూటమి సాధించిన విజయం చిరస్థాయిగా నిలిచిపోతుందని మంత్రి అన్నారు. రాయచోటి మున్సిపాలిటీలోని 44 స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులు విజయం సాధించారని తెలిపారు. 2005లో మున్సిపాలిటీ ఏర్పడిన నాటి నుంచి తొలిసారిగా రాయచోటిలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేశామని పేర్కొన్నారు.అదేవిధంగా రాయచోటి నియోజకవర్గంలోని 67 ఎంపీటీసీ స్థానాలను కూటమి కైవసం చేసుకుందని చెప్పారు. వీటిలో 66 స్థానాలు ముందుగానే ఏకగ్రీవం కాగా, మిగిలిన ఒక స్థానంలోనూ కూటమి అభ్యర్థి ఘన విజయం సాధించారని వివరించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఎంపీపీ స్థానాలను సైతం కైవసం చేసుకున్నామని తెలిపారు. అన్నమయ్య జిల్లావ్యాప్తంగా జడ్పీటీసీ స్థానాల్లో కూటమి ప్రభంజనం సృష్టించిందని, రాయచోటి నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీలతో విజయం సాధించామని పేర్కొన్నారు.**వైసీపీ ఆత్మపరిశీలన చేసుకోవాలి**గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాయచోటి నియోజకవర్గానికి ఏం అభివృద్ధి చేశారో ఆ పార్టీ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఎన్నికల్లో పోటీ చేసేందుకు వైసీపీకి అభ్యర్థులు కూడా దొరకని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన వైసీపీ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.గత ప్రభుత్వ హయాంలో చేయలేని అభివృద్ధిని కూటమి ప్రభుత్వం చేపడుతుంటే వైసీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని ఆరోపించారు. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని, అందుకే కూటమికి పెద్దఎత్తున మద్దతు ప్రకటిస్తున్నారని అన్నారు.**రాయచోటి అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు**కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్ల కాలంలో రాయచోటి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చామని మంత్రి తెలిపారు. ప్రతి ప్రభుత్వ శాఖకు అవసరమైన నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని వివరించారు.రాయచోటి పట్టణ ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు వెలిగల్లు జలాశయం నుంచి రెండో దశ నీటి సరఫరా పథకానికి రూ.119 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. జలజీవన్ మిషన్ ద్వారా 850 గ్రామాలకు తాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. రైతుల విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ఇప్పటివరకు 1,200 ట్రాన్స్‌ఫార్మర్లు అందించినట్లు వివరించారు.రాయచోటి మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.36 కోట్ల నిధులు తీసుకొచ్చామని, పట్టణంలోని ప్రతి వీధిలో సీసీ రోడ్లు నిర్మించి రాయచోటిని సుందర నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు.**వైద్య, విద్యా రంగాలకు పెద్దపీట**పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణ పనులు చేపట్టామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఉన్న 10 డయాలసిస్ యూనిట్ల సంఖ్యను 25కు పెంచుతున్నట్లు చెప్పారు. తద్వారా కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు.మైనార్టీ విద్యార్థుల విద్యాభివృద్ధికి రూ.35 కోట్లతో పాఠశాల, హాస్టల్ భవనాల నిర్మాణ పనులు చేపట్టినట్లు వివరించారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు.**పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లు**రాయచోటి పట్టణంలో రెండు అన్న క్యాంటీన్లను ప్రారంభించామని, దాతల సహకారంతో రెండు క్యాంటీన్లలోనూ పేదలకు ఉచితంగా భోజనం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. మానవతా దృక్పథంతో నిరుపేదలు, కార్మికులు, ఇతర అవసరార్థులకు ఆహార సదుపాయం కల్పిస్తున్నామని పేర్కొన్నారు.అదేవిధంగా నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి సుమారు రూ.48 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ముఖ్యంగా రాయచోటిలోని శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు.**కార్యకర్తల కష్టాన్ని మరువం**కూటమి విజయానికి అహర్నిశలు కృషి చేసిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు కులమతాలకు అతీతంగా సముచిత గుర్తింపు, గౌరవం కల్పిస్తామని హామీ ఇచ్చారు.రాబోయే పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులే విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాయచోటి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

సంతమాగులూరు మండలం, తంగేడుమల్లి ఎంపీటీసీ స్థానాన్ని కైవసం చేసుకున్న తెలుగుదేశం పార్టీ

1,146 ఓట్ల భారీ మెజారిటీతో టీడీపీ అభ్యర్థి మాలెంపాటి శ్రీనివాసరావు ఘన విజయం



నిర్భయవార్త ప్రతినిధి :ప్రకాశం జిల్లా: సంతమాగులూరు మండలం తంగేడుమల్లి ఎంపీటీసీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించింది. టీడీపీ బలపరిచిన అభ్యర్థి మాలెంపాటి శ్రీనివాసరావు తన సమీప ప్రత్యర్థిపై 1,146 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొంది ఎంపీటీసీ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఆయన ఎన్నికల అధికారుల చేతుల మీదుగా అధికారిక డిక్లరేషన్ ఫారాన్ని అందుకున్నారు.ఈ అఖండ విజయం పట్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు. మాలెంపాటి శ్రీనివాసరావుకు మంత్రి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా నూతన ఎంపీటీసీ మాలెంపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ... తనపై విశ్వాసముంచి ఇంతటి చారిత్రాత్మక విజయాన్ని అందించిన తంగేడుమల్లి ప్రజలకు, ఓటర్లకు హృదయపూర్వక పాదాభివందనాలు తెలియజేశారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్ గారి నాయకత్వం, ఆయన వెన్నుదన్నుగా నిలవడమే ఈ భారీ విజయానికి ముఖ్య కారణమని కొనియాడారు. మంత్రివర్యుల మార్గదర్శకత్వంలో గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.ఎన్నికల ప్రచారంలో అహర్నిశలు శ్రమించి, తమకు అండగా నిలిచిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నేతలు, మండల నాయకులు, యువకులు మరియు కార్యకర్తలకు పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు మాలెంపాటి గోపి, శివరామకృష్ణ, సీనియర్ నాయకులు కొత్తపల్లి హనుమంతరావు, మాలెంపాటి హనుమంతరావుతో పాటు భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజలు పాల్గొని మిఠాయిలు పంచుకుంటూ విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు.

మైలవరం ఎంపీటీసీ 2 గా పసుపులేటి రేణుక ఘన విజయం



నిర్భయవార్త ప్రతినిధి :మైలవరం, నవంబర్ 7 : స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి ఎంపీటీసీ అభ్యర్థి పసుపులేటి రేణుక అపార ప్రజాదరణతో ఘన విజయం సాధించారు. ఓట్ల లెక్కింపు ప్రారంభం నుంచే తన ఆధిక్యతను ప్రదర్శించిన ఆమె, ప్రత్యర్థిపై భారీ మెజార్టీతో విజయం సాధించి ఎంపీటీసీగా ఎన్నికయ్యారు. ఏపీఎంపీ రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ జర్నలిస్ట్ పసుపులేటి చైతన్య సతీమణి రేణుక. ఈ సందర్భంగా విజేత పసుపులేటి రేణుక మాట్లాడుతూ తనపై నమ్మకంతో గెలిపించిన మండల ప్రజలకు, నియోజకవర్గ నాయకులకు, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు శ్రేయోభిలాషులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తాను. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్తాను" అని తెలిపారు.ఈ విజయం కూటమి నాయకులు, కార్యకర్తల కష్టానికి, ప్రజలు చూపిన అభిమానానికి నిదర్శనమని పార్టీ నాయకులు కొనియాడారు. విజయం సాధించిన పసుపులేటి రేణుక కి మండల ప్రజలు, కూటమి శ్రేణులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేశారు

బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువకులకు ఉచిత స్టడీ మెటీరియల్ అందజేత





నిర్భయవార్త ప్రతినిధి :ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మంచాల మండలం ఆరుట్ల, మంచాల బండలేమూరు, చెన్నారెడ్డి గూడ , పటేల్ చెరువు తండా గ్రామాలలో బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి చేతుల మీదుగా నిరుద్యోగులకు పోటీ పరీక్షలు సంబంధించిన ఉచిత స్టడీ మెటీరియల్ అందించడం జరిగింది.... ఈ సందర్భంగా బూడిద రామిరెడ్డి మాట్లాడుతూ.. నేటి యువకులు రేపటి దేశ పౌరులు కాబట్టి యువకులు సమాజ పట్ల బాధ్యతాయుతంగా ఉండి కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవలందిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో ద మిషన్ సీఐ ఏడుకొండల్, బుస్సు పుల్లారెడ్డి, చిందం రఘుపతి, ఫౌండేషన్ సభ్యులు పున్నం రాము, మంగ ఐలేష్, అశ్వల బాలరాజ్, కాట్రోత్ రాజు, సద్దాం హుస్సేన్, బి వెంకటేష్, షాకీర్ గణేష్, బాహుబలి, శివ, గ్యార శేఖర్, లింగం యాదవ్, మోహన్ జే, వెంకీ, యువకులు, తదితరులు పాల్గొన్నారు

అర్హులైన ఓటర్లు నవంబర్ 30న ప్రచురించే తుది జాబితాలో పేరు నమోదు చేసుకోవాలి -- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ



నిర్భయవార్త ప్రతినిధి :విజయవాడ: నవంబర్ 7, 2026.:ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (SI=-2026) ప్రక్రియలో భాగంగా డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో ఎ.ఎన్.డి.డి. (గైర్హాజరు, వలస వెళ్లినవారు, మరణించినవారు, ద్వంద్వ నమోదైనవారు) కేటగిరీల కింద పేర్లు తొలగించబడిన అర్హులైన ఓటర్లకు నవంబర్ 30న ప్రచురించే తుది జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు.ఎన్యుమరేషన్ ఫారాలు అందని ఎ.ఎస్.డి.డి. ఓటర్ల జాబితాలు పోలింగ్ కేంద్రాలు, గ్రామ పంచాయతీ, మున్సిపల్, ఈఆర్వో కార్యాలయాలతో పాటు సంబంధిత వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. బీఎల్ఓల ద్వారా పాక్షికంగా పూరించిన ఫారాలు పంపిణీ చేస్తారని, పాత ఎపిక్ నంబర్ ఆధారంగా ఈసీఐనెట్ (జుజ×చీజు) ద్వారా కూడా ఫారాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.నివాసం మారని ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారంతో పాటు అనుబంధం-బి (Annexure-B) డిక్లరేషన్‌ను పూరించి బీఎల్ఓ లేదా ఈఆర్వోకు సమర్పించాలని, లేదా ఆన్‌లైన్‌లో అందజేయవచ్చన్నారు. రాష్ట్రంలోనే నివాసం మార్చినవారు ఫారం-8 అవసరం లేకుండా ఎన్యుమరేషన్ ఫారంతో పాటు అనుబంధం-సి (Annexure-C), కొత్త చిరునామా ధ్రువీకరణ పత్రాలను నూతన నియోజకవర్గ ఈఆర్వో లేదా ఏఈఆర్వోకు సమర్పించాలని సూచించారు. నిరాశ్రయుల విషయంలో బీఎల్ఓ విచారణ నివేదికనే ధ్రువీకరణగా పరిగణిస్తారని తెలిపారు.ఇప్పటికే ఫారం-6 సమర్పించిన వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని, దరఖాస్తు ఆమోదం పొందితే పాత ఎపిక్ నంబరే కేటాయించబడుతుందని కలెక్టర్ వివరించారు.అర్హులైన ఓటర్లందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అవసరమైన పత్రాలతో దరఖాస్తు సమర్పించి, నవంబర్ 30న ప్రచురించే తుది ఓటర్ల జాబితాలో తమ పేర్లు నమోదయ్యేలా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ కోరారు

చిత్రసీమ



దీపావళి వేడుకల్లో కృతి శెట్టి

• చూపు తిప్పుకోనివ్వని లుక్ • సీక్వెన్స్, క్రిస్టల్ వర్క్‌తో మెరిసిపోయిన బేబమ్మ

దీపావళి వేడుకల సందర్భంగా అందాల భామ కృతి శెట్టి తన గ్లామరస్ లుక్‌తో అభిమానులను ఆకట్టుకుంది. తాజాగా ఆమె చేసిన ఫొటోషూట్‌కు సంబంధించిన చిత్రాలు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నాయి. పండుగ కళ ఉట్టిపడేలా సంప్రదాయ, ఆధునిక శైలుల కలయికతో కూడిన ఔట్‌ఫిట్‌లో కృతి మెరిసిపోయింది. లేత పింక్ కలర్ దుస్తుల్లో కృతి ఎంతో అందంగా కనిపించింది. స్వీట్‌హార్ట్ నెక్‌లైన్‌తో రూపొందించిన కార్సెట్ బ్లౌజ్, దానికి జతగా ఉన్న డ్రేప్‌పై వెండి రంగు సీక్వెన్స్, క్రిస్టల్ వర్క్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రతి అల్లికలోనూ మెరుపులు కనిపించేలా ఈ ఔట్‌ఫిట్‌ను తీర్చిదిద్దారు. ఇక మెడలో సున్నితమైన పెర్ల్ చోకర్, చెవులకు ముత్యాల డ్రాప్ ఇయర్‌రింగ్స్ ధరించి తన అందాన్ని మరింత పెంచుకుంది. మెరిసే చర్మ సౌందర్యానికి తగిన సాఫ్ట్ మేకప్, భుజాలపైకి జాలువారుతున్న ఒత్తైన నల్లని ఉంగరాల జుట్టుతో కృతి చూపు తిప్పుకోనివ్వని విధంగా కనిపించింది. లేత పింక్ బ్యాక్‌డ్రాప్‌లో ఆమె ఇచ్చిన స్టైలిష్ పోజులు ఫొటోలకు మరింత అందాన్ని తీసుకొచ్చాయి. మొత్తానికి దీపావళి వేడుకల్లో తన ఫెస్టివ్ లుక్‌తో బేబమ్మ మరోసారి అభిమానుల మనసు దోచుకుంది.

మాల్దీవుల్లో సారా సందడి

సముద్ర తీరంలో స్టైలిష్ పోజులు..

• వైరల్ అవుతున్న ఫొటోలు

• ఐలాండ్ ప్రిన్సెస్ అంటూ ఫ్యాన్స్ కామెంట్స్



చైల్డ్ ఆర్టిస్ట్‌గా గుర్తింపు తెచ్చుకుని, ప్రస్తుతం హీరోయిన్‌గా రాణిస్తున్న సారా అర్జున్ వెకేషన్ మూడ్‌లో ఉంది. కుటుంబంతో కలిసి మాల్దీవుల్లో విహరిస్తున్న ఈ బ్యూటీ.. అక్కడ దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకుంది. రంగురంగుల ప్రింటెడ్ క్రాప్‌టాప్, మ్యాచింగ్ స్కర్ట్‌లో స్టైలిష్‌గా కనిపిస్తూ సముద్ర తీరంలో సందడి చేసింది. గోల్డ్ ఇయర్ రింగ్స్, గాజులతో తన లుక్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చుకుంది. 'ది స్టాండర్డ్ మాల్దీవ్స్' రిసార్ట్‌లో కుటుంబంతో ప్రశాంతంగా గడుపుతున్న ఫొటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. "కొన్ని ప్రదేశాలు ప్రతి యాత్రను ప్రత్యేకంగా మారుస్తాయి" అంటూ క్యాప్షన్ ఇచ్చింది. ఈ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారగా, అభిమానులు ఆమెను 'ఐలాండ్ ప్రిన్సెస్' అంటూ ప్రశంసిస్తున్నారు.

లక్ష్మీదేవిలా శ్రద్ధా కపూర్

'ఈత' కొత్త లుక్ వైరల్

• దీపావళి సందర్భంగా బయోపిక్ నుంచి స్పెషల్ పోస్టర్



దీపావళి పండుగకు ముందే నటి శ్రద్ధా కపూర్ అభిమానులకు కనువిందు చేసింది. లక్ష్మీదేవిని తలపించేలా సంప్రదాయ పట్టుచీర, భారీ ఆభరణాలు, కిరీటంతో మెరిసిపోయింది. ఆమె నటిస్తున్న 'ఈత' సినిమా నుంచి దీపావళి సందర్భంగా విడుదలైన కొత్త లుక్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ పోస్టర్‌లో శ్రద్ధా రూపం చూసిన అభిమానులు ఫిదా అవుతున్నారు. అచ్చం లక్ష్మీదేవి తమ ఇంట్లోకి అడుగుపెట్టిన అనుభూతి కలుగుతోందంటూ కామెంట్లు చేస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ తమాషా, లావణి కళాకారిణి వీఠాభాయి భౌ మాంగ్ నారాయణ్‌గర్ జీవిత కథ ఆధారంగా 'ఈత' బయోపిక్ తెరకెక్కుతోంది. ఇందులో శ్రద్ధా కపూర్ టైటిల్ రోల్ పోషిస్తున్నారు. లక్ష్మణ్ ఉతేకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో వీఠాభాయి కళా ప్రస్థానం, ఆమె జీవితంలోని కీలక ఘట్టాలను ఆవిష్కరించనున్నారు. ఈ సినిమా 2026 డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ జానపద కళాకారిణి గరివిడి లక్ష్మి దక్షిణాదిలో ఎంతగా గుర్తింపు పొందారో.. మహారాష్ట్రకు చెందిన తమాషా, లావణి కళాకారిణి వీఠాభాయి కూడా ఉత్తరాదిలో అంతే పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. అలాంటి గొప్ప కళాకారిణి పాత్రను శ్రద్ధా పోషిస్తుండటం విశేషం. సాధారణ కమర్షియల్ చిత్రాలకు భిన్నంగా తనలోని నటనా ప్రతిభను వెలికితీసే పాత్రను ఎంచుకుని శ్రద్ధా మరోసారి వార్తల్లో నిలిచింది. ఇప్పటికే విడుదలైన కొత్త లుక్‌లో ఆమె ఆహార్యం, ఆభరణాలు, హుందాతనం పాత్రపై ఆసక్తిని పెంచుతున్నాయి. సినిమా కోసం శ్రద్ధా చేస్తున్న ఈ ప్రయోగం ప్రేక్షకుల్లో అంచనాలను పెంచుతోంది.

చీరకట్టులో మృణాల్ మెరుపులు

అందంతో ఆకట్టుకున్న సీతామహాలక్ష్మి

• మిర్రర్ వర్క్ శారీలో రాయల్ లుక్..


• ఫిదా అవుతున్న అభిమానులు



పండుగలు వచ్చాయంటే చాలు సినీ తారలు సంప్రదాయ వస్త్రధారణలో మెరిసిపోతూ అభిమానులకు కనువిందు చేస్తుంటారు. తాజాగా దంతేరాస్ సందర్భంగా టాలీవుడ్ ప్రేక్షకులకు సీతామహాలక్ష్మిగా చేరువైన అందాల భామ మృణాల్ ఠాకూర్ తన అందమైన ఫొటోలతో సోషల్ మీడియాలో సందడి చేసింది. తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసిన ఫొటోలు నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ సీమా గుజ్రాల్ కలెక్షన్ నుంచి ఎంపిక చేసుకున్న ఐవరీ కలర్ డిజైనర్ శారీలో మృణాల్ మెరిసిపోయింది. జార్జెట్ ఫ్యాబ్రిక్‌తో రూపొందించిన ఈ చీరపై అందమైన పైస్లీ ఎంబ్రాయిడరీ, అద్దాల పనితనం, పూసల అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దీనికి జతగా స్టాపీ స్టైల్ నెక్‌లైన్‌తో కూడిన హెవీ మిర్రర్ వర్క్ బ్లౌజ్ ధరించి తన లుక్‌కు మరింత అందాన్ని అద్దింది. ఇక తన సంప్రదాయ రూపానికి రాయల్ టచ్ ఇచ్చేలా మెడలో మ్యాచింగ్ హెవీ చోకర్ నెక్లెస్, చెవులకు పెద్ద చెవిపోగులు ధరించింది. మేకప్, ఆభరణాలు, చీరకట్టుతో మృణాల్ ఎంతో ఎలిగెంట్‌గా కనిపించింది. దంతేరాస్ స్పెషల్ లుక్‌లో మృణాల్ అందాన్ని చూసి అభిమానులు ఫిదా అవుతున్నారు. మిర్రర్ వర్క్ చీరలో దీపావళి కళంతా మృణాల్‌లోనే కనిపిస్తోందంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. మొత్తానికి సంప్రదాయ వస్త్రధారణలోనూ తన స్టైల్‌తో అభిమానుల మనసు దోచుకుంది ఈ సుందరి.

ఆకాంక్ష సింగ్ అందాల సందడి

వైరల్‌గా మారిన ఫొటోలు



అందాల భామ ఆకాంక్ష సింగ్ తన లేటెస్ట్ ఫొటోలతో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన చిత్రాలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. పసుపు రంగు చీరలో ఎంతో అందంగా, సంప్రదాయంగా కనిపిస్తూ నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తోంది. సన్నని తెల్లటి అంచు, అక్కడక్కడా వెండి రంగు అలంకరణలతో ఉన్న పసుపు చీరలో ఆకాంక్ష మెరిసిపోయింది. తన సహజమైన అందానికి మరింత ఆకర్షణ జోడించేలా పంకర జుట్టులో చిన్న పసుపు రంగు పువ్వును పెట్టుకుంది. మెడలో స్టోన్స్‌తో కూడిన తెల్లటి చోకర్, చేతికి సింపుల్ పెర్ల్ బ్రేస్‌లెట్ ధరించి తన లుక్‌ను పూర్తి చేసింది. పచ్చని ప్రకృతి మధ్య రాతి నేపథ్యంతో అందమైన చిరునవ్వులు చిందిస్తూ ఆమె ఇచ్చిన పోజులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎలాంటి హంగులు లేకుండా సింపుల్‌గా కనిపిస్తూనే తన అందంతో అభిమానులను కట్టిపడేస్తోంది. మొత్తానికి పసుపు చీరలో ఆకాంక్ష సింగ్ లుక్ నెటిజన్ల ప్రశంసలు అందుకుంటోంది.

రాయల్ లుక్‌లో రియా చక్రవర్తి..

మెరూన్ డ్రెస్‌లో మెరుపులు

దీపావళి వేడుకలు సినీ తారల సందడితో కళకళలాడుతున్నాయి. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా నిర్వహించిన వార్షిక దీపావళి వేడుకలకు పలువురు సెలబ్రిటీలు హాజరై తమ స్టైలిష్ లుక్స్‌తో ఆకట్టుకున్నారు. ఈ వేడుకల్లో నటి రియా చక్రవర్తి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డీప్ మరూన్ కలర్ ఔట్‌ఫిట్‌లో రియా ఎంతో హుందాగా కనిపించింది. స్ట్రాప్‌లెస్ డిజైన్‌తో ఉన్న బ్లౌజ్‌పై తెల్లటి పూల ఎంబ్రాయిడరీ వర్క్ అందంగా తీర్చిదిద్దారు. దీనికి మ్యాచింగ్‌గా డ్రేప్డ్ స్కర్ట్ ధరించగా, ఒక భుజంపై వేసుకున్న ప్రత్యేక ఎంబ్రాయిడరీ కేప్ ఆమె లుక్‌కు రాయల్ టచ్ ఇచ్చింది. ఇక భారీ చెవిపోగులు, చోకర్ నెక్లెస్, చేతికి గాజులతో తన అందాన్ని మరింత పెంచుకుంది. సాఫ్ట్ వేవీ హెయిర్ స్టైల్, సింపుల్ మేకప్‌తో ప్రశాంతమైన చూపులతో కెమెరాలకు పోజులిచ్చింది. మొత్తానికి సంప్రదాయ వస్త్రధారణకు ఆధునిక గ్లామర్‌ను జోడిస్తూ రియా చక్రవర్తి చేసిన ఈ ఫ్యాషన్ సందడి నెటిజన్లను ఆకట్టుకుంటోంది. మరూన్ రంగు దుస్తుల్లో ఆమె రాయల్ లుక్ ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది.

Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197